


మంత్రి లోకేష్ పక్కా ప్రణాళికతో ఏపీ విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. 100 రోజుల కార్యాచరణతో టెన్త్ ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ పాఠశాలలు, బాలికల ప్రతిభ విద్యా వ్యవస్థలో వచ్చిన గుణాత్మక మార్పుకు నిదర్శనం. విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులకు అభినందనలు.. విఫలమైన వారు పట్టుదలతో సాగాలి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 01.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 9 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# టెన్త్‌లో 'లోకేష్' మార్క్ సక్సెస్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :పూను స్పర్ధలు విద్యలందే- వైరములు వాణిజ్యమందే- అని ఎలుగెత్తి చాటిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు మంత్రి నారా లోకేష్. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్ చేపట్టారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధన కోసం విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యాశాఖ ఒక ప్రణాళిక రూపొందించింది. వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయడంతో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఉత్తీర్ణతా శాతం మెరుగుపడింది.

**100-రోజుల కార్యాచరణ ప్రణాళిక..** : రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల కోసం రూపొందించిన 100-రోజుల కార్యాచరణ ప్రణాళికను 06-12-2025 నుండి 15-03-2026 పరీక్షల ఆరంభం అయ్యేవరకూ క్రమపద్ధతిలో అమలు చేశారు. ఈ కాలంలో విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడిలేకుండా 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఇందులో వచ్చిన మార్కులను రాజూర్వా మొబైల్ యాప్ లో పొందుపరిచారు. ప్రతిరోజూ 6 డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా లీప్ యాప్‌లో మార్కులను విశ్లేషించారు.

**షైనింగ్ స్టార్స్ .. రైజింగ్ స్టార్స్** : స్లిప్ టెస్టులలో విద్యార్థుల సామర్థ్యాలను డ్యాష్ బోర్డు ద్వారా మదింపు చేసి షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్ గా విద్యార్థులను గుర్తించారు. వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధించారు. సబ్జెక్టుల వారీగా సందేహాలను తీర్చే పద్ధతిని అవలంబించారు.

**సాధనే విజయం** : "సాధనమున పనులు సమకూరు ధరలో- అన్న వేమన మాట స్ఫూర్తిగా విద్యార్థులతో క్రమపద్ధతిలో చేయించిన సాధన వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. వీరి నిరంతర సాధన కోసం అవసరమైన మోడల్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులు విద్యాశాఖ ప్రచురించి ఉచితంగా అందించింది. వీటి ద్వారా విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేశారు. విభిన్న సామర్థ్యాలు కలిగిన విద్యార్థుల సాధనకు నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం ద్విభాషా (దీఅ-శ్రీఅఅస్త్రఖుశ్రీ) క్వశ్చన్ బ్యాంకులు, మిర్రర్-ఇమేజ్ రూపంలో (ఒక వైపు తెలుగు, మరోవైపు ఇంగ్లీష్) ప్రచురించి అందించారు. వీటిని ప్రాక్టీస్ చేసిన విద్యార్థులు మెరికల్లా తయారయ్యారు.

**ఏ ఒక్క అవకాశం జారకుండా..** : ఏ విద్యార్థి ఎందులో బలంగా ఉన్నారు, ఎందులో బలహీనంగా ఉన్నారో ముందుగానే డ్యాష్ బోర్డు విశ్లేషణ పూర్తయ్యింది. దీనికి అనుగుణంగా పాఠశాలకు ఒక సెట్ చొప్పున 15 కార్యాచరణ ప్రణాళిక పుస్తకాలు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశారు. మిగతా 2లో...

- టెన్త్‌లో ఫలించిన వందరోజుల ప్రణాళిక
- విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్లానింగ్ సక్సెస్
- గతేడాది కంటే టెన్త్ పరీక్షల్లో పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- అన్ని యాజమాన్య పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు
- గతేడాది 81.1 శాతం ..ప్రస్తుతం 85.25 శాతం నమోదు
- బాలుర కంటే బాలికలు 5.22 శాతం ఎక్కువ ఉత్తీర్ణత
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 72.8 శాతం నుంచి 78.39 శాతానికి పెరిగిన ఉత్తీర్ణత
- సున్నాశాతం ఫలితాలు ప్రైవేటు స్కూళ్లు 11.. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 5

## రీసెర్చ్ సెంటర్లుగా యూనివర్సిటీలు

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు
- టెక్నాలజీ కాంపిటెన్సీ వచ్చేలా విద్యార్థులకు శిక్షణ
- రాష్ట్ర యువతకు అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ నైపుణ్యాలు
- ఉద్యోగాల కల్పనపై సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం
- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలు తెస్తున్నామన్న మంత్రి లోకేష్

2 లో



## పెట్రో, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగాలి



- ఇంధన కృత్రిమ కొరతను సృష్టిస్తున్న అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి ...
- ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ వంటి అత్యవసర ఇంధనాలు ప్రతి వినియోగదారునికి ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం అందుబాటులో ఉండేలా పెట్రోల్ బంక్ యాజమాన్యాలు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ కోరారు. రాష్ట్రంలో మొత్తం 4,312 పెట్రోల్ బంకులు ఉండగా, అందులో సుమారు 1.29 శాతం (దాదాపు 56 బంకులు) కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొన్ని ప్రాంతాల్లో ఇంధన సరఫరాపై అనిశ్చితి నెలకొనే అవకాశాల దృష్ట్యా, ముందస్తుగా తగిన నిల్వలు ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. వ్యవసాయం, రవాణా, అత్యవసర సేవల వంటి కీలక రంగాలపై మిగతా 2లో...



## అమరావతి 'అనంత' వేగం

### అమరావతి నిర్మాణానికి భారీ కేటాయింపులు!

- సచివాలయం, అసెంబ్లీ పనులకు రూ. 2,540 కోట్లు.
- పోలవరం నిర్వాసితులకు అండ
- అమరావతి రైతులకు తీపి కబురు!
- రాజధానిలో 'ఆర్-5' జోన్ రద్దు
- భూములు వెనక్కి తీసుకున్న క్యాబినెట్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం గురువారం అమరావతిలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. హోంశాఖలో కానిస్టేబుళ్లుగా ఉన్న 358 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. న్యాయ శాఖలో 21 పోస్టులు కొత్తగా క్రియేట్ చేశామని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

• వివరాలు 2 లో

## బాలికలేదే పైచేయి

- పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల...



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ఏపీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది 85.25 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మిగతా 2లో...

## నేడే పెన్షన్ల పండుగ

- రూ. 2720.67 కోట్లు విడుదల
- 62.47 లక్షల మందికి మే 1న పంపిణీ
- పెన్షన్ల కోసం రూ. 63,157 కోట్లు ఖర్చు చేశాం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- కొత్తగా 8,141 మందికి 'స్పౌజ్' పెన్షన్లు
- నేడే పంపిణీకి ప్రభుత్వం సిద్ధం

2 లో





## రియల్ విన్నర్స్‌తో సీఎం విందు

- 'టీమ్ ఏపీ'కే అవార్డు అంకితం!
- మంత్రులు, అధికారులకు సీఎం ఆత్మీయ విందు
- రిఫార్మర్ అవార్డు 'టీమ్ ఏపీ' కృషికి నిదర్శనం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : తనకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు రావడానికి 'టీమ్ ఏపీ' పనితీరే కారణమని సీఎం చంద్రబాబు అన్నారు. అవార్డు నేపథ్యంలో మంత్రులు, సీఎస్, డీజీపీ, సెక్రటరీలు, హెచ్‌వోడీలకు 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' పేరుతో మిగతా 2లో...

## రైతులకు శాస్త్రీయ దిశానిర్దేశం



- "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ - మేగజైన్‌తో రైతులకు శాస్త్రీయ మార్గనిర్దేశం
- పాడి పశువుల నుంచి కోట్ల ఆర్థిక వృద్ధి
- రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- ప్రతి ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో పశు సంవర్ధక రంగ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో "పశు సంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. మిగతా 2లో...

## మందుల సరఫరా వ్యవస్థ ప్రక్షాళన



- అసుపత్రులకు మందుల సరఫరా వ్యవస్థలో సమగ్ర మార్పులు
- ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం!
- ప్రస్తుత మందుల వినియోగ జాబితాలపై పునఃపరిశీలన
- వైద్యులు, ఫార్మసిస్టుల మధ్య సమన్వయం పెరగాలి
- త్వరలో మరో 380 రకాల మందులు అసుపత్రులకు సరఫరా చేస్తాం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వాసుపత్రులకు జరిగే మందుల సరఫరా వ్యవస్థలో సమూల మార్పులను తెస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మందుల కొనుగోళ్లు, అసుపత్రులకు పంపిణీ, రోగులకు అందించే వరకు. వివిధ సాయిల్లో జరుగుతున్న ప్రస్తుత ప్రక్రియను ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పునఃస్సమీక్ష చేయిస్తామని స్పష్టంచేశారు. అలాగే ప్రస్తుతం అసుపత్రులకు ఎసెన్షియల్ మెడిసిన్ లిస్ట్ (ఈఎంఎల్), ఆడిషనల్ మెడిసిన్ లిస్ట్ (ఏఎంఎల్) జాబితాలో ఉన్న మందులు, వాటి సరఫరా, మార్కెట్లో కొత్తగా అందుబాటులోనికి వచ్చిన కాంబినేషన్ మందుల వాడకం గురించి కూడా అవసరమైన చర్యలు మిగతా 3లో...



## విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు

- మంత్రి లోకేష్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక సత్ఫలితాలు... హోం మంత్రి అనిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంత్రి లోకేష్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక మంచి ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. మిగతా 2లో...

## హజ్ యాత్రకు సర్వం సిద్ధం



- అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్
- హజ్ యాత్రికులకు ఏర్పాట్లపై సచివాలయంలో సమీక్ష
- ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి ఫరూక్ ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : హజ్-2026 యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు చెందిన హజ్ యాత్రికులకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు, వసతులు కల్పించాలని రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మే 4 వ తేదీ నుండి హజ్ యాత్రకు హైదరాబాద్ , బెంగళూరు నుండి బయలుదేరే యాత్రికులకు ఏర్పాట్ల కల్పనపై అధికారులతో మంత్రి ఫరూక్ సమీక్ష చేశారు. గురువారం సచివాలయం లోని మూడవ బ్లాక్ లో సమావేశం మందిరంలో సమీక్ష జరిగింది. మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, సభ్యులు, సీఈఓ గౌస్ పీర్‌తో 3లో...

## టెన్త్‌లో 'లోకేష్' మార్క్ సక్సెస్



(మొదటి పేజీ తరువాయి)

స్లిప్ టెస్టులలో వెనుకబడిన విద్యార్థుల కోసం 30-రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్ ప్రత్యేకంగా నిర్వహించి, వారి పనితీరు మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు.

విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి, ఫలితాలను మెరుగుపరచడానికి ప్రీ-ఫైనల్, గ్రాండ్ టెస్టులు నిర్వహించారు.

**అమలు చేసిన పథకాలు ఇవీ.. :** ఇవి కాకుండా స్కూలులోనే విద్యార్థులకు మధ్యాహ్నం పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో యూనిఫాం, బెల్టు, బ్యాగు, షూ, డిక్షనరీ, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అన్నీ ఉచితంగా అందజేశారు. ఎంత మంది పిల్లలు చదివితే వారి తల్లికి ఒక్కొక్కరికీ 15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం కింద అందిస్తూ వచ్చారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అందించిన సంక్షేమ పథకాలు ఒకవైపు..మరో వైపు కార్యాచరణ ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ సమన్వయంగా సాగడంతో టెన్త్‌లో మంచి ఫలితాలు వచ్చాయి.

**కృషికి తగ్గ ఫలితాలు :** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రణాళిక-దాని అమలును నిరంతర పర్యవేక్షణ చేయడం, అధికారయంత్రాంగం అలుపెరుగని కృషి ఫలితంగా, మార్చి 2026 పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగింది. గత ఏడాది 81.1 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతమై 85.25 శాతానికి ఉత్తీర్ణత పెరిగింది. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గతేడాది 72.8 శాతం ఉన్న ఉత్తీర్ణత ఈ సంవత్సరం 78.39 శాతానికి పెరిగింది.

**భళా బాలిక :** ఈ ఏడాది పరీక్షా ఫలితాల్లో బాలుర కంటే బాలికలు ఉత్తీర్ణతా శాతం ఎక్కువ సాధించారు. బాలుర ఉత్తీర్ణత 82.68శాతం కాగా, బాలికల ఉత్తీర్ణత 87.90శాతంగా ఫలితాల్లో తేలింది. బాలుర కంటే బాలికలు 5.22 శాతం మెరుగైన ఫలితాలను సాధించి భళా బాలిక అనిపించుకున్నారు.

**ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలే మిన్న :** రాష్ట్రంలో మొత్తం 12089 స్కూళ్లు ఉండగా, ఇందులో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 6785 , ఎయిడెడ్ స్కూళ్లు 260, ప్రైవేటు స్కూళ్లు 5044 ఉన్నాయి. వీటిలో సున్నా శాతం ఫలితాలు వచ్చిన పాఠశాలలు 16. వీటిలోనూ ప్రైవేట్ స్కూళ్లు 11 కాగా, 2 ఎయిడెడ్, 2 ఆశ్రమ పాఠశాలలు, 1 జిల్లా పరిషత్ హైస్కూల్ ఉంది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సున్నా ఫలితాలు వచ్చినవి కేవలం 5గా ఉండి ప్రభుత్వ విద్య నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**ఇది అందరి విజయం అంటోన్న విద్యాశాఖా మంత్రి :** ఐకమత్యంగా, అంకితభావంతో, ప్రణాళికాబద్ధంగా అంతా కలిసి పనిచేయడం వల్లనే టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం లక్ష్యం మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉందన్నారు. మన ప్రణాళికలు విజయవంతమై మంచి మార్కులు వచ్చాయని, ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, పిల్లల్లో నైతిక విలువలు పెంపు, సమగ్ర విద్యా వికాసానికి మరింత కృషి చేయాలన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి సమాజ సహకారం అవసరం అని పేర్కొన్నారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన పిల్లలు అందరికీ అభినందనలు తెలిపారు. ఫెయిలైన వారూ తక్కువ ప్రతిభ ఉన్నవారు కాదని, ఆత్మన్యూనతకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రయత్నమే తొలి విజయం అని, ఓటమి విజయానికి తొలి మెట్టు వంటిదని, పట్టుదలతో ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు.

## రియల్ విన్నర్స్‌తో సీఎం విందు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఆత్మీయ విందు ఇచ్చారు. వివిధ శాఖల్లో మంచి పనితీరు కనబర్చిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులనూ ఆహ్వానించారు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులే రియల్ విన్నర్స్ అని సీఎం తెలిపారు. విందుకు ముందు మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, సాధించాల్సిన లక్ష్యాలు, అనుసరించాల్సిన విధానాలపై భేటీలో చర్చించారు.

## పెట్రో, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇంధన లభ్యత ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు .

ఇంధన సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజల్లో నమ్మకం పెంపొందించడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు అంతరాయం లేకుండా కొనసాగేందుకు సహకరించాలని బంక్ నిర్వాహకులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా, సంబంధిత ప్రభుత్వ శాఖలు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని పీవీయన్ మాధవ్ సూచించారు.

## బాలికలదే పైచేయి



(మొదటి పేజీ తరువాయి)

బాలికలు 87.9 శాతం ఉత్తీర్ణత,, బాలురు 82.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి పరీక్షా ఫలితాలను https://results.bse.ap.gov.in/ ఈ వైబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.

**బాలికలదే పైచేయి :** ఈ ఏడాది ఫలితాల్లో కూడా బాలికలే పైచేయి సాధించారు. 87.90 శాతం ఉత్తీర్ణతతో అబ్బాయిల కంటే 5.22 శాతం మెరుగైన ప్రదర్శన కనబరిచారు. విద్యారంగంలో బాలికల ఎదుగుదలకు ఈ ఫలితాలు ఒక నిదర్శనం. ప్రతీ సబ్జెక్టులోనూ, ముఖ్యంగా సెకండ్ లాంగ్వేజ్‌లో 99.82 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషం.

**అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఎప్పుడంటే.? :** రాష్ట్రంలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే 25 నుంచి జూన్ 4 వరకు నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. ఎగ్జామ్ ఫీజును మే 1 నుంచి 9 వరకు చెల్లించవచ్చునని తెలిపింది. రూ. 50 లేట్ ఫితో మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించింది. రీకౌంటింగ్(సబ్జెక్ట్‌కు రూ. 500), రీవెరిఫికేషన్(సబ్జెక్ట్‌కు రూ. 1000) కోసం మే 1 నుంచి 7 వరకు అప్లై చేసుకోవచ్చునని తెలిపింది.

# రీసెర్చ్ సెంటర్లుగా యూనివర్సిటీలు

**అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) :**విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా వివిధ కోర్సులు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని సీఎం సూచనలు చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యాశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తోన్న కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థ మార్పులను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. గేమ్ చేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ లాంటి రంగాల్లోనూ కొత్త కోర్సులు రావాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా ఈ కోర్సులు రావాల్సిన అవసరముందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొట్ట మొదటగా కోర్సును ప్రారంభించటంపై ఆంధ్రా యూనివర్సిటీని సీఎం అభినందించారు. ఏపీలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయంగా పోటీ పడాలని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 200 యూనివర్సిటీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ యూనివర్సిటీకి ఏదో ఒక పారిశ్రామిక సంస్థ అనుసంధానమై ఉండేలా చూడాలని సూచనలు చేశారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా వివిధ విదేశీ భాషల్లో శిక్షణ కోసం ఓ విభాగం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను అందిపుచ్చుకునేలా ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకూ వివిధ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు కెరీర్ బిల్డింగ్, కేరక్టర్ బిల్డింగ్ జరిగేలా ఉండాలన్నారు. ఆరోగ్యం, టెక్నాలజీతో పాటు బెస్ట్ ప్రాక్టీసెస్‌ను నేర్పించేలా ఈ పాఠ్యాంశాలు ఉండాలని సూచించారు. దీని కోసం ఐఐటీ చెన్నై సహా వివిధ ప్రతిష్టాత్మక సంస్థల నుంచి సిఫార్సులు తీసుకుని విద్యాశాఖలో అమలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యూనివర్సిటీ రికార్డులను కూడా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలో వివిధ ప్రతిష్టాత్మక సంస్థలు లాజిస్టిక్స్, ఏవియేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు



వచ్చాయని సీఎం తెలిపారు.

**త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ :** విద్యార్థులకు అన్ని పోషకాలు అందేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థుల మానసిక, భౌతిక ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా తల్లితండ్రులు కూడా విద్యార్థుల హాజరు, వారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా అత్యుత్తమ టీచర్లతో వీడియో మాధ్యమంలో పాఠాలు చెప్పిస్తే బోధనలో నాణ్యత పెరుగుతుందని సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సాంకేతికతతో కూడిన ఉత్తమ విద్యను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పీ4 లాంటి కార్యక్రమాలను అనుసంధానం చేసుకుని మౌలిక సదుపాయలను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు కొత్త ఆలోచనలు వచ్చేలా విద్యార్థులతో ఓ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించాలని స్పష్టం చేశారు. దానికి స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ గా పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఆటిజం సహా దివ్యాంగ విద్యార్థులకు విద్యాబోధనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్రీడలతో పాటు మానసికోల్లాసానికి కో-కరిక్యులర్ యాక్టివిటీస్ ను పెంచాలని అన్నారు. ఇంటర్ లో విద్యార్థులకు వివిధ కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని దీనిపై అధ్యాపకులకు కూడా రీఓరియంటేషన్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో టెక్నాలజీ కాంపిటెన్సీ పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమం ద్వారా పరిశుభ్రత అంశాలపై విద్యార్థుల్లో ఎలాంటి మార్పులు వచ్చాయన్నది అధ్యయనం చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

**నైపుణ్యాలపై ర్యాండమ్ స్కిల్ ఆడిట్ :** రాష్ట్రంలోని యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఏమేరకు నైపుణ్యాలు కలిగి ఉన్నారో ర్యాండమ్ స్కిల్ ఆడిట్ నిర్వహించాలని సీఎం సూచనలు చేశారు. ఈ విషయంలో ప్రపంచ స్థాయి అత్యుత్తమ నైపుణ్యాలు మన యువతకు అందేలా చేయాలని.. దీని కోసం ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలతో అనుసంధానం చేసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేసేందుకు స్కిల్ గ్యాప్ అడ్వైజర్లను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు మెరుగవటంతో పాటు ఆర్థిక లావాదేవీలు పెద్ద ఎత్తున జరుగుతాయన్నారు. పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో అభివృద్ధి చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ లు ఇంజనీరింగ్ కళాశాలల ద్వారా ఎనర్జీ, లాజిస్టిక్స్, క్వాంటం, ఏఐ లాంటి రంగాల్లో నైపుణ్యాలు పెరగాలని స్పష్టం చేశారు. దీంతో పాటు జిల్లాల వారీగా స్కిల్ మ్యాప్ తయారు చేయటం ద్వారా ఏ ప్రాంతంలో ఎంతమంది నిపుణుల లభ్యత ఉందనేది తెలియచేసే అవకాశముందన్నారు. గడచిన 22 నెలల్లో ఇప్పటి వరకూ 7 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయని.. స్వయం ఉపాధితో పాటు ఎంఎస్ఎంఈల ద్వారా కూడా ఉపాధి వచ్చిందన్నారు. వివిధ శాఖల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చిన వివరాలను ఓ సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. త్వరలోనే నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను వెల్లడించాలని సూచించారు.

**అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్ :** రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో రీస్ట్రక్చర్ చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. సమీక్షలో భాగంగా విద్యాశాఖలో చేపడుతున్న విప్లవాత్మక సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. వన్ క్లాస్ వన్ టీచర్ పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ ను కూడా పెంచుతున్నామని వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు బ్రిడ్జి కోర్సులు కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ ఎన్సీఆర్టీ సహకారంతో పాఠ్యాంశాలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తున్నట్టు తెలిపారు. బోధనా మాధ్యమాలను అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఫిన్ ల్యాండ్ లాంటి దేశాలకు పంపుతున్నట్టు సీఎంకు తెలియచేశారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరరీలో ఏపీని అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని మంత్రి వివరించారు. టీచర్ - స్టూడెంట్- అవుట్ కమ్ అనే విధానంలో విద్య శాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. బడికోసం పేరిట మౌలిక సదుపాయాలను కల్పించటంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రికి తెలియచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాలేజీ అవర్స్ ను పెంచి విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేలా శిక్షణ ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఫలితాలు మెరుగయ్యేలా ఇంటర్ సప్లిమెంటరీ రాసుకునేందుకు విద్యార్థులకు వెసులుబాటు కల్పించామని తెలియచేశారు. నైపుణ్యాభివృద్ధి కల్పనలో భాగంగా అందరికీ స్కిల్ అసెస్మెంట్ చేస్తున్నామన్నారు. ఈ సమీక్షకు పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.


# అమరావతి 'అనంత' వేగం!

(మొదటి పేజీ తరువాయి)

దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏపీ భవన్‌లో మేనేజర్ పోస్టు కొత్తగా క్రియేట్ చేశామని ఆయన వివరించారు. పంచాయితీ రాజ్ శాఖలో 20 పోస్టులు సరెండర్ చేసి.. అవసరం ఉన్న చోట ఆ పోస్టులను క్రియేట్ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు అదనంగా నిధులు కేటాయింపులు చేయాల్సి వచ్చిందన్నారు మంత్రి.

ఆర్ అండ్ బికి సంబంధించి న్యూఢిల్లీలో కొత్తగా ఏపీ భవన్ నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మొత్తం 11.53 ఎకరాల్లో రూ.124.5 కోట్లతో ఈ భవనాన్ని నిర్మిస్తామని వివరించారు. దీనిని ఎన్‌బీసీసీకి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ భవన నిర్మాణం ఏపీ సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని.. అందులో సమావేశ మందిరం కూడా ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి పయ్యావుల తెలిపారు. కొత్త ఏపీ భవనానికి ఏదైనా మంచి పేరు పెట్టాలని సీఎం చంద్రబాబు కోరారన్నారు.

మున్సిపాలిటీల్లో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ఫీజులో మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి పయ్యావుల తెలిపారు. లోకల్ బాడీలలో షాపింగ్ కాంప్లెక్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో యూనిఫాం రేటు పెట్టి 7 శాతం పెంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. మున్సిపాలిటీల్లో మ్యుటేషన్ ఛార్జీలు



వేర్వేరుగా ఉన్నాయని.. వాటన్నింటిని యూనిఫాం పాలసీ కిందకి తీసుకురావాలని ఈ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

కృష్ణానది కరకట్టను ఆధునీకరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రూ.443 కోట్లతో ఈ కరకట్టను విస్తరించాలని నిర్ణయించామన్నారు. రాజధాని అమరావతిలో ఆఫీసుల కాంప్లెక్స్‌లకు సంబంధించి సెక్రటేరియట్, జీఏడీ టవర్స్, గ్లాస్ క్లాడింగ్, క్రౌన్ ఏర్పాటుకు రూ.2,540 కోట్ల కేటాయించినట్లు మంత్రి పయ్యావుల వివరించారు. సెల్ అండ్ కోర్ స్ట్రక్చర్ కోసం రూ.1,200 కోట్లు, క్వాంటం వ్యాలీకి 37 లక్షల చదరపు అడుగుల నిర్మాణం ఉంటుందన్నారు. ఒక్కొక్కటి 43 టవర్స్ ఉంటాయని.. రెండు టవర్స్‌లోనే అన్నిఫెసిలిటీలు ఉంటాయని చెప్పారు. అసెంబ్లీ బిల్డింగ్‌కు సంబంధించి సెంట్రల్ స్పైర్, పార్కింగ్ తదితర సౌకర్యాల కోసం నిధులు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వివరించారు.

రూ.580 కోట్లతో ఉండవల్లిలో చేపడుతున్న ట్రంక్, అదర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. ఎన్ 10 నుంచి ఎన్ 13 వరకూ జంక్షన్‌కు అండర్ గ్రౌండ్ కేబుల్‌లో రీ రూటింగ్‌కు రూ.100 కోట్లు అదనంగా పెంచామన్నారు. గతంలో సీఆర్డీఏ భూములను ఆర్ 5 జోన్ పేరుతో రెవెన్యూ శాఖకు ఇచ్చామని గుర్తు చేశారు. ఆ భూములను వెనక్కి తీసుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. యాన్యుటీ విలువ పెంచాలని రైతులు గతంలో ప్రభుత్వాన్ని కోరారని.. అందుకు కేబినెట్ అంగీకరించిందన్నారు.

సీఆర్డీఏకు కొత్త కేటాయింపులు ఇవ్వడానికి అనుమతివ్వడం జరిగిందన్నారు. సెబీ, స్వామి నారాయణ్, డీఏవీ పబ్లిక్ స్కూల్‌కు భూములు ఇవ్వాలని సీఆర్డీఏ చేసిన సిఫార్సుకు ఓకే చెప్పామన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. 3.57 లక్షలు ఇవ్వనుండగా... ఆర్ అండ్ ఆర్ కాలనీలో కాక బయట కట్టుకుంటామంటే.. భూమికి రూ. లక్ష అదనంగా చెల్లించాలని మంత్రి మండలిలో ఆమోదం తెలిపినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు.

# రైతులకు శాస్త్రీయ దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పాడి పశువులు, సన్న జీవాలు, నాటు కోళ్ల పెంపకంతో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. 2025-26 సంవత్సరానికి పశు సంవర్ధక శాఖ ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి నమోదవడం ఈ రంగ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోందన్నారు. అయినప్పటికీ సంప్రదాయ యాజమాన్య పద్ధతులు, కూలీల కొరత, పశుగ్రాసాల లోపం, పెరుగుతున్న దాణా ఖర్చులు వంటి సమస్యల కారణంగా ఆశించిన స్థాయి వృద్ధి సాధ్యంకావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, అదే సమయంలో పశుసంవర్ధక రంగాన్ని వాణిజ్య సరళిలో అభివృద్ధి చేసుకునే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పాడి పశువులు, జీవాలు, నాటు కోళ్లు, పందుల పెంపకం వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

విశాఖపట్నంలోని రాష్ట్ర పశుగణ యాజమాన్య



సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1500 మంది శిక్షణ పొందగా, అందులో సుమారు 200 మంది రైతులు వాణిజ్యపరంగా లాభసాటిగా పశుసంవర్ధక కార్యకలాపాలను విజయవంతంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను ఏప్రిల్ నెల నుండి [www.apahsmile.in (http://www.apahsmile.in) "స్మైల్" వెబ్‌సైట్‌తో పాటు రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ మేగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, పోషణ, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం, విజయగాథలు, నిపుణుల సూచనలు, రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడతాయని చెప్పారు. అలాగే, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పశు సంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కూడా ఈ-మేగజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

పశుసంవర్ధక రంగాన్ని సేంద్రియ, వాణిజ్య పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే ఒక్క ఎకరం నుంచి సంవత్సరానికి రూ.5-6 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని మంత్రి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటిలో ఒక ఎంట్రప్రెన్యూర్ ఏర్పడి, వ్యక్తిగత అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డా.వై. సింహాచలం, జాయింట్ డైరెక్టర్ డా. బైరాగి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే పెన్షన్ల పండుగ



**అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం మే 1, 2026న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా 62,47,538 మంది లబ్ధిదారులకు రూ. 2720.67 కోట్లు విడుదల చేసింది. గ్రామాలు, వార్డులు, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేసే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగా మంజూరైన స్పౌస్ పెన్షన్ల కింద 8,141 మంది లబ్ధిదారులకు రూ. 4.15 కోట్లు విడుదల చేసి, మే 1న పంపిణీ చేయనున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ నెల విడుదలతో కలిపి మొత్తం రూ. 63,157.90 కోట్లు పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు ఇతర అర్హుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

## విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు



(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం 81.14% నుంచి 85.25%కి పెరగడం, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో 78.39% ఉత్తీర్ణత నమోదవడం ఆయన దూరదృష్టి, పక్కా ప్రణాళికకు నిదర్శనమని అన్నారు. ఈ ఫలితాల్లో బాలికలు 87.90% ఉత్తీర్ణతతో ముందంజలో నిలవడం శుభపరిణామమని మంత్రి అనిత పేర్కొన్నారు. జిల్లాల వారీగా చూస్తే పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం, విజయనగరం జిల్లా మూడో స్థానం, అనకాపల్లి జిల్లా ఆరో స్థానం సాధించడం ఆనందకరమని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వచ్చిన ఈ గుణాత్మక మార్పుకు మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ కారణమని ఆమె అభిప్రాయపడ్డారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు మంత్రి అభినందనలు తెలిపారు. అలాగే పరీక్షల్లో విఫలమైన విద్యార్థులు నిరుత్సాహపడకుండా, మరింత కృషి చేసి మళ్లీ ప్రయత్నించి విజయాన్ని సాధించాలని మంత్రి అనిత సూచించారు.

## రాష్ట్రంలో 20 లక్షలకుపైగా ఉద్యోగ కల్పన సాధించాలి

**అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) :**రాష్ట్రంలో 20 లక్షల కు పైగా ఉద్యోగ కల్పన లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రుల బృందం పిలుపునిచ్చింది. ఏపి సచివాలయంలోని 5వ బ్లాక్ లో ఇన్వేస్ట్మెంట్ అండ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ పై గురువారం మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది ఈ సందర్భంగా మంత్రులు. కందుల దుర్గేష్,టి.జి.భరత్, గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఈ సమీక్షలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 20లక్షలకు పైగా ఉద్యోగ కల్పనపై చేస్తున్న కృషిని ప్రశంసించారు. నూతనంగా ఉద్యోగ కల్పన పొందిన ప్రతి ఒక్కరి వివరాలను ఒక పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు.

## నేటి నుండి జనాభా లెక్కల తొలి విడత ప్రక్రియ ప్రారంభం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రేపటి నుండి జిల్లా వ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో మొదటి విడత ప్రారంభమవుతుందని, దీనిని 100 శాతం పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రాథమికంగా హౌసింగ్ మ్యాపింగ్ నిర్వహిస్తారని, ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి నిర్ణీత 33 రకాల ప్రశ్నలతో వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

గురువారం పల్నాడు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా స్థాయి అధికారులు మరియు మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా లెక్కల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లుగా డీఆర్వో నారద మునిని నియమించారు.

అదే విధంగా ?వచ్చే నెల మొదటి గురువారం (మే 07) జిల్లా వ్యాప్తంగా 'స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5 నుండి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సినేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవిలను ఆదేశించారు. ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ప్రతి ఇంట్లోనూ కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు మరియు ఖాళీగా ఉన్న ఇంటి స్థలాల్లో న్యూట్రీ గార్డెన్స్ పెంచి, తద్వారా లభించే స్వచ్ఛమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా, భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాలపై దృష్టి సారించి, వారందరూ సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలకు తమ పేర్లను నమోదు చేసుకునేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎరువుల వినియోగంపై అవగాహన




**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండలము లోని, కొమ్మూరు, వల్లూరు గ్రామముల నందు గుంటూరు జిల్లా రైతు శిక్షణ కేంద్రం మరియు లాంఫారం కృషి విజ్ఞాన కేంద్రం సహకారముతో రైతులకు సమతుల్య ఎరువుల వినియోగము గురించి అవగాహన కార్యక్రమము నిర్వహించినారు. ఈ కార్యక్రమములో

శాస్త్రవేత్త గంగా దేవి మాట్లాడుతూ భూమిలో సేంద్రీయ కర్బన స్థాయి 1% నుండి 0.3-0.4% వరకు తగ్గిపోయినదని తెలిపారు. దీనికి కారణము అధికముగా రసాయనిక ఎరువులు వినియోగము ముఖ్యముగా యూరియా అధికంగా వాడుటము వలన తక్షణ దిగుబడులు కొరకు యూరియా డి ఏ పి కాంప్లెక్స్ ఎరువులు నత్రజని అధికంగా ఉన్న ఎరువులు ఎక్కువగా వినియోగించుట వలన భూమిలో సేంద్రీయ కర్బనం తగ్గిపోతూ,భూమిలో ఎన్ పి కె పోషకాలు సమతుల్యత తీవ్రముగా దెబ్బతింటుందన్నారు. ఫలితముగా భూమి గట్టిపడి నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గి పంటలు ఎదుగుదల సక్రమముగా లేక దిగుబడులు తగ్గుతున్నాయన్నారు .

లాంఫారం శాస్త్రవేత్త ఎం గంగాదేవి మాట్లాడుతూ రైతులు పచ్చి రొట్ట పైరులు జీలుగ, జనుము, పిల్లి పెసర మొదలగు వాడిని భూమిలో కలియు దున్నవలెనని సూచించారు. దీనివలన భూమిలో ఉపయోగకర సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూమిలో సేంద్రియ కర్బనము వృద్ధి చెందుతుందని తెలిపారు. అధిక యూరియా వలన మట్టిలో ఆర్గానిక్ కార్బన్ తగ్గి భూమి గట్టి పడుతుంది, నత్రజని వినియోగము అధికమై భాస్వరం, పొటాషియం, ఎరువులు లోపం ఏర్పడి పంటలు సరిగ్గా పండవు నీటి కాలుష్యం పెరుగుతుందన్నారు.

రైతు శిక్షణ కేంద్రం గుంటూరు వ్యవసాయ అధికారి రాజ వంశీ మాట్లాడుతూభూగర్భ జలాల్లో నైట్రేట్ సాయి పెరిగి నీరు కలుషిత అవుతుందన్నారు. ఎక్కువ ఎరువులు వాడటం వలన సాగు ఖర్చు పెరిగి లాభాలు తగ్గుతున్నాయి కావున రైతులు సిఫార్సు మేరకు ఎరువులు వినియోగించవలెనని పచ్చిరొట్టపైర్లు సాగు చేసి భూసారాన్ని కాపాడుకొనవలనని తెలిపినారు. ఈ కార్యక్రమము నందు మండల వ్యవసాయ అధికారి వి. సుధాకర్, ఎ ఈ ఓ అనిల్ కుమార్, వి హెచ్ ఎ జరీనా , ఎం పి ఈ ఓ ప్రసాద్ , మరియు గ్రామరైతులు హాజరైనారు.

## పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల ల విద్యార్థులు ప్రతిభ చాటారు అత్యధిక మార్కులతో కాకుమాను ఎన్ జడ్పీ హై స్కూల్ విద్యార్థి కంకణాల శ్రీకాంత్ (588) మార్కులతో కాకుమాను మండలం స్థాయిలో మొదటి స్థానం, గుంటూరు జిల్లా స్థాయిలో పదవ స్థానం లో నిలిచారు. ఈ సందర్భంగా కాకుమాను మండలం విద్యా శాఖ అధికారి కెనెడి మాట్లాడుతూ కాకుమాను మండలం పరిధిలో జడ్పీ హెచ్ ఎస్ బోడిపాలెం 14 మంది పరీక్షలు రాయగ 14 మంది ఉత్తీర్ణత సాధించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించ్చారు. జడ్పీ హెచ్ ఎస్ రేటూరు 13 మంది పరీక్షలు రాయగ 9 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. జడ్పీ హెచ్ ఎస్ చినలింగాయ పాలెం నందు 46 మంది పరీక్షలు రాయగ 45 మంది పాస్ అ-య్యారు. 98 శాతం ఉత్తీర్ణత సాధించ్చారు. జడ్పీ హెచ్ ఎస్ కాకుమాను నందు 55 మంది పరీక్షలకు హాజరువగా 42 మంది పాసయ్యారు. 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. వి డి ఆర్ ఎస్ ఎం కొమ్మూరు నందు 21 మంది పరీక్షలు కు హాజరువగా 14 మంది పాసయ్యారు. 67 శాతం ఉత్తీర్ణత సాధించ్చారు. జడ్పీ హెచ్ ఎస్ గరికపాడు నందు 23 మంది పరీక్షలకు హాజరువగా 20 మంది పాసయ్యారు. 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. డా. బి ఆర్ అంబెడ్కర్ గురుకులం బాలికల పాఠశాల కాకుమాను 77 మంది పరీక్షలకు హాజరువగా 76 మంది పాసయ్యారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇండియన్ జెమ్స్ ప్రయివేట్ పాఠశాల 37 మంది పరీక్షలకు హాజరువగా 35 మంది పాసయ్యారు. 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలం స్థాయిలో ఎన్ జడ్పీ హై స్కూల్ కాకుమాను కు చెందిన కె శ్రీకాంత్ 588 మార్కులతో మండలం స్థాయిలో ప్రధమ స్థానం లో నిలిచారు. మండలం ద్వితీయ స్థాయిలో డా బి ఆర్ అంబెడ్కర్ గురుకుల పాఠశాల కు చెందిన రూపాదేవి 572 మార్కులు. తృతీయ స్థానంలో ఎన్ జడ్పీ హై స్కూల్ కాకుమాను అనూహ్య 571 మార్కులు సాధించారు. విద్యార్థులకు విద్య శాఖ అధికారులు, తల్లితండ్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# మందుల సరఫరా వ్యవస్థ ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

చేపడతామని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్లు అవసరంలేని వాటిని తొలగించి, అవసరమైన వాటిని జాబితాలోనికి చేరుస్తామన్నారు. ఫార్మసీ రంగ నిపుణులు, వైద్యులు, సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టుల అభిప్రాయాలను కూడా పరిగణనలోనికి తీసుకుంటామన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) అదధికారులు, పలు బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్లతో ప్రభుత్వాసుపత్రుల్లో మందుల లభ్యత, ఇతర అంశాలపై రెండున్నర గంటలపాటు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ వైద్యులు, ఫార్మసిస్టుల మధ్య మందుల లభ్యత, వినియోగంపై ప్రస్తుతం ఉన్న సమన్వయాన్ని మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద వినియోగించే మందుల సరఫరాలో జాప్యం జరగకుండా ఉండేందుకు ప్రస్తుత విధానం ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల ద్వారా కాకుండా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి నేరుగా



ఆసుపత్రులకు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోకల్ పర్చేజింగ్ విధానంలో ఆసుపత్రులు సూపరింటెండెంట్ల ద్వారా జరిగే మందుల కొనుగోళ్ళ వివరాలను ఈ-ఔషధి పోర్టల్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఈ విధానం అమల్లో లేనందున మందుల కొనుగోళ్ల గురించి, అవి అందుబాటులో ఉన్నాయా? లేవా? లేదా అన్న వివరాలు తెలియటం లేదని తెలిపారు. వైద్యులు రోగులకు రాసే 'ప్రిసప్షన్లోని మందుల గురించి కూడా ఆడిటింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ (వర్చువల్ ద్వారా) వెల్లడించారు. ఆసుపత్రుల వారీగా ఉన్న మందుల వివరాలను ఇతర ఆసుపత్రుల వారు 'ఆన్లైన్లో తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తామని, తద్వారా అవసరాలకు తగ్గట్లు మందులను స్థానికంగానే సర్దుబాటు చేసుకునేందుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్లలో కొరతగా ఉండే మందుల వివరాలు: (నాన్ ఆవైలబులిటీ సర్టిపికెటు) ఆన్లైన్లో సూపరింటెండెంట్లు తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తామని కూడా తెలిపారు.

ఏపీ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ అధికారులు మాట్లాడుతూ ఎసిన్షియల్ మెడిసిన్ లిస్టు, అడిషనల్ మెడికల్ లిస్టుల్లో 712కుగాను 176 రకాల మందులను ఆసుపత్రులకు సరఫరా చేయలేకపోతున్నామన్నారు. 176 రకాల మందుల వినియోగం తక్కువగా ఉందని, ఎక్కువ మొత్తంలో అవసరమయ్యే మందులను సరఫరా చేసేందుకు సంస్థలు ముందుకొస్తున్నాయన్నారు. తక్కువ మొత్తంలో అవసరమైన మందులు కావాలంటే మాత్రం సదరు సంస్థలు ముందుకు రావడంలేదని తెలిపారు బెటాక్సాలాల్ (కంటి మందు), ట్యాక్రోలిమస్ (స్కిన్ క్రీమ్) మందుల కొనుగోలుకు టెండర్లు దాఖలైనా తక్కువ మొత్తంలో అనేసరికి, సదరు సంస్థలు ముందుకు రాలేదన్నారు. మిథైయిల్ ప్రడ్నిసిలోన్ (స్టెరాయిడ్) ఇంజెక్షన్ సరఫరాకు అసలు టెండరు కూడా రాలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఆసుపత్రుల వారు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వికేంద్రీకరణ విధానంలో స్థానికంగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మందుల నిల్వలకు తగ్గట్లు చర్యలు 177 రకాల మందుల నిల్వలు మూడు నెలలకు సరిపడా ఉన్నాయని, 84 రకాలు 2-3 నెలల వరకు, 80 రకాల మందులు ఒకటి నుంచి రెండునెలల వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

మరో 178 రకాల మందుల నిల్వలు నెల వరకు సరిపోయేలా ఉన్నాయన్నారు. 17 రకాల మందులు అందుబాటులో లేవన్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ లో ఉన్న నిల్వలకు తగ్గట్లు 380 రకాల మందులను రూ.71.12 కోట్లతో కొనుగోలు చేసామని, ఆర్డర్ల ప్రకారం త్వరలోనే సదరు ఆసుపత్రులకు సరఫరా అవుతాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, విశాఖ, గుంటూరు బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు వాణీ, రమణ యశస్వి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పాటు సంబంధిత పర్యవేక్షణ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏపీ నుంచి ప్రస్తుత ఏడాది దాదాపు 2000 మంది యాత్రికులు హజ్ యాత్రకు వెళ్ళనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఇందులో ఏప్రిల్ 18, 19 తేదీలలో రెండు విడతలుగా విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి 333 మంది యాత్రికులు తరలి వెళ్లిన విషయం ను మంత్రి గుర్తు చేశారు. మిగతా యాత్రికులు హజ్ యాత్రకు వెళ్ళేందుకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాలను ఎంచుకోవడం జరిగిందన్నారు.

**మే 4 నుంచి 21 తేదీల మధ్యలో దశలవారీగా హజ్ కు.. :** హైదరాబాద్ నుండి 1202 మంది యాత్రికులు, బెంగళూరు నుండి 447 మంది యాత్రికులు మే 4 వ తేదీ నుండి 21 తేదీ మధ్యలో దశలవారీగా హజ్ యాత్రకు బయలుదేరడం జరుగుతుందని, వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో అవసరమైన అన్ని చర్యలను చేపట్టడం జరుగుతుందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఇతర రాష్ట్రాలలోని విమానాశ్రయాల ద్వారా హజ్ కి వెళ్లే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, తగిన ఏర్పాట్లు, వసతి, వైద్య సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని మైనారిటీ శాఖ



కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ కు మంత్రి ఫరూక్ సూచించారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాలను ఉపయోగించే ఆంధ్రప్రదేశ్ యాత్రికుల కోసం అవసరమైన ఏర్పాట్లలో భాగంగా నోడల్ అధికారులను నియమించడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులైన యాత్రికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక సహాయ సేవల ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని సమీక్షలో నిర్ణయించారు. ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద యాత్రికులకు భద్రమైన, పరిశుభ్రమైన వసతి ఏర్పాట్లును ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం, హజ్ కమిటీల సమన్వయం తో ముందుకు సాగాలని అధికార యంత్రాంగానికి మంత్రి ఫరూక్ దిశా నిర్దేశం చేశారు. మంచి వసతి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజన వసతి, శుద్ధజల తాగునీటి సదుపాయాలు, సేవలందించే సంస్థలను ఎంపిక చేయడం, వాటిపై పర్యవేక్షణ విధానం అమలు చేయడం, విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడం వంటి అంశాలుపై ఆయా రాష్ట్రాల పర్యవేక్షణ బృందాలతో సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్-ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను సులభతరం చేయడం, సహాయ కేంద్రాలు, క్షేత్రస్థాయిలో సహాయక సిబ్బంది నియామకం, విమానాల రాకపోకల వివరాలు, లగేజి నిబంధనలపై ఎప్పటికప్పుడు హజ్ యాత్రికులకు సమాచారం అందించడం, డాక్యుమెంట్ల ధృవీకరణ, తక్షణ సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రాల ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం, గుర్తింపు ధృవీకరణ, రద్దీ నివారణ చర్యలు, రోజువారీ సమీక్షలు, ఫిర్యాదు కౌంటర్ల ఏర్పాటు వంటి అంశాలు పై మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని యాత్రికులు అందరూ తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ హజ్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల విజయానికి మంత్రి కందుల దుర్గేష్ సలాం



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నిడదవోలు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్, ఇతర పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరచడం పట్ల రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన మార్కులు వారి కష్టానికి, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ మన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి విజయానికి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు మంత్రి దుర్గేష్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన విద్యాశాఖ అధికారులు మరియు ఉపాధ్యాయుల కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులందరూ ఇదే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. "చదువే సంపద అని నమ్మి, క్రమశిక్షణతో చదివిన విద్యార్థులు నిడదవోలు నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చారు. రాబోయే రోజుల్లో వీరికి ప్రభుత్వం తరపున మంచి ప్రోత్సాహం ఉంటుంది" అని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరింత బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని దిశానిర్దేశం చేశారు..రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతంపై సంతోషం వ్యక్తం చేశారు.

# టెన్త్‌లోనూ బీసీ బిడ్డల హవా

- ఏంజేపీలో 96.02 శాతంతో ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతం అధికం
- విద్యార్థుల సంఖ్యాపరంగా ఎంజేపీదే ఉత్తీర్ణతా శాతం టాప్
- 100 బీసీ గురుకులాల్లో 32 గురుకులాల్లో నూరు శాతం ఫలితాలు
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- ఇంటర్ లోనూ సత్తాచాటిన బీసీ విద్యార్థులు
- బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు... 85.99 శాతం ఉత్తీర్ణత
- బీసీ బిడ్డల అత్యుత్తమ ఫలితాల సాధనపై మంత్రి సవిత హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పదో తరగతి ఫలితాల్లోనూ మహాత్మా జ్యోతి రావు పూలే బీసీ గురుకుల పాఠశాలలు(ఎంజేపీ) విద్యార్థులు సత్తాచాటారు. 96.02 శాతం సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థుల సంఖ్యాపరంగా ప్రభుత్వ పరిధిలో నడిచే విద్య సంస్థలు, గురుకులాల్లో ఎంజేపీ గురుకులాలు ఫస్ట్ ప్లేస్ లో నిలిచాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు వంద బీసీ గురుకుల విద్యా సంస్థలు హాజరుకాగా, 32 గురుకులాల్లో వంద శాతం మేర ఫలితాలు రావడం విశేషం. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే ఎంజేపీ గురుకులాలు 10 శాతం కంటే అధికంగా ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమై, ఏప్రిల్ రెండో తేదీన ముగిశాయి. ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. 6,18,131 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా, 85.25 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు టెన్త్ లోనూ సత్తాచాటారు. ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫస్ట్ ఇంటర్ లో 97 శాతం, సెకండ్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ బిడ్డలు ఉత్తీర్ణత శాతం సాధించి భేష్ అనిపించుకున్నారు. టెన్త్ లోనూ అదే స్థాయిలో ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వంద ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,433 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతం మేర ఉత్తీర్ణతా శాతంతో ఉత్తీర్ణులయ్యారు.

**విద్యార్థుల సంఖ్యాపరంగా టాప్ ప్లేస్ ఎంజేపీదే... :** గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం ప్రకారం 96.02 శాతంతో ద్వితీయ స్థానంలో ఎంజేపీ గురుకుల విద్యార్థులు నిలిచారు. స్కూళ్లు, విద్యార్థుల సంఖ్య ప్రకారం చూస్తే ఎంజేపీ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. వంద బీసీ గురుకులాలకు చెందిన 5,501 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతంతో 5,274 మంది మేర ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల కు చెందిన విద్యార్థులు 96.04 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే 0.02 శాతంతో ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు ముందంజలో నిలిచారు. టెన్త్ పరీక్షలకు 50 ఏపీ రెసిడెన్షియల్ కు చెందిన విద్యార్థులు 3,135 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. ఆ లెక్కన చూస్తే, ఏపీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ విద్యార్థులే టాప్ లో నిలిచినట్లు.

**గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత :** గతేడాది కంటే ఎంజేపీ స్కూళ్లలో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది పదో తరగతి పరీక్షల్లో 95 శాతం మేర ఎంజేపీ విద్యార్థులు ఫలితాలు సాధించారు. ఈ ఏడాది 96.02 శాతంతో ఎంజేపీ విద్యార్థులు సత్తాచాటారు. గతేడాది కంటే 1.02 శాతం మేర ఫలితాలు అధికంగా రావడం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరంలో 5,355 మంది పరీక్షలు రాయగా, ఈ ఏడాది 5,501 మంది పదో తరగతిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షలకు వంద ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు పరీక్షలు రాయగా, 32 గురుకులాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో పాసయ్యారు. ఎంజేపీ గురుకులాల్లో నంద్యాల జిల్లా నరవాడకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలవడం విశేషం. ఆ పాఠశాలకు చెందిన శ్రీసాయి 596 మార్కులతో ఎంజేపీ గురుకులాలకు చెందిన విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచారు. రీటా సాహితి 593 మార్కులు, యశస్విని 589 మార్కులు సాధించి రెండు మూడు స్థానాల్లో నిలిచారు.

**మొన్న ఇంటర్ లో... నేడు టెన్త్‌లో... :** ఈ నెల 15న విడుదలైన ఇంటర్ ఫలితాల్లోనూ ఎంజేపీ విద్యార్థులు సత్తా చాటిన విషయం విదితమే. జూనియర్ ఇంటర్ లో 97 శాతంతో, సీనియర్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ విద్యార్థుల ఉత్తీర్ణత సాధించారు. నేడు విడుదలైన టెన్త్ పరీక్షల్లోనూ 96.02 శాతం బీసీ బిడ్డలు ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. టెన్త్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 85.25 శాతం కాగా, ఎంజేపీ ఉత్తీర్ణతా శాతం 96.02 శాతంగా నమోదైంది. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతానికి పైగా సాధించడం విశేషం. జూనియర్ ఇంటర్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 77 శాతం రాగా, ఎంజేపీలో 97 శాతంతో, సీనియర్ ఇంటర్ లో రాష్ట్రస్థాయి ఫలితాలు 81 శాతం రాగా, ఎంజేపీ విద్యార్థులు 94 శాతంతో సత్తా చాటారు. ప్రభుత్వ పరిధిలో నడిచే అన్ని విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాలు జూనియర్ ఇంటర్ లో ప్రథమ స్థానంలో, సీనియర్ ఇంటర్ లో రెండో స్థానం నిలవడం గుర్తించుకోదగ్గ విషయం.

**బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు... :** ఎంజేపీ గురుకులాలతో పాటు బీసీ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులూ పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల నుంచి 8,466 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 7,280 మంది ఉత్తీర్ణత సాధించారు. 85.99 శాతం మేర బీసీ హాస్టళ్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. వారిలో 5,187 మంది ఫస్ట్ క్లాస్ లో, 1,437 మంది సెకండ్ క్లాస్, 652 మంది థర్డ్ క్లాస్ లో ఉత్తీర్ణులయ్యారు. 1,001 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. బీసీ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు గతేడాది 77.22 శాతంతో ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 8.78 శాతం అధికంగా 85.99 శాతంతో పాసవ్వడం విశేషం. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీ హై స్కూల్ విద్యనభ్యసిస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థిని కె.మానస మ్యాథ్స్ లో వందకు వంద మార్కులు సాధించడం విశేషం.

**అమరావతిలో సంబరాలు :** టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 96.02 శాతంతో ఉత్తీర్ణత సాధించడంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవితను ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత మర్యాదపూర్వకంగా కలిశారు. గతేడాది కంటే అత్యధిక ఫలితాలు సాధించినందుకు కార్యదర్శి సత్యనారాయణకు, మాధవీలతకు స్వీట్లు అందజేసి, మంత్రి అభినందించారు.

**సత్ఫలితాలిచ్చిన వంద రోజుల ప్రణాళికలు : మంత్రి సవిత :** టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ గురుకులు, బీసీ హాస్టళ్ల విద్యార్థులు సత్తా చాటడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీలో 96.02 శాతంతో, బీసీ హాస్టళ్లలో 85.99 శాతంతో ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. మంత్రి లోకేశ్ రూపొందించిన వంద రోజుల ప్రణాళికలు సత్ఫలితాలిచ్చాయన్నారు. బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంకల్పమన్నారు. విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని నమ్మి, ఎంజేపీ, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి రెండేళ్లలో పెద్దఎత్తున నిధులు కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బీసీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు బీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరపున మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్న వ్యసనం:అనాథలైన వృద్ధ తల్లిదండ్రులకు భరోసానిచ్చిన .ఆనంద్ కృష్ణారెడ్డి



**బొల్లారం :** బొల్లారం జీహెచ్ఎంసీ 272 డివిజన్ పరిధిలో ఒక నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. గత రెండు దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తూ, వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రాజు అనే వ్యక్తి అనారోగ్యం మరియు ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడు రాజు గత కొంతకాలంగా మద్యానికి బానిసవ్వడం, దానికి తోడు తీవ్రమైన అనారోగ్యం (షుగర్ మరియు చివరి దశలో ఉన్న క్యాన్సర్) అతని జీవితాన్ని కుంగదీశాయి. నాలుగు నెలల క్రితమే భార్యను కోల్పోయిన రాజు, వ్యాధి ముదరడంతో శరీరం కుళ్ళిపోయి అనుభవించిన నరకయాతన వర్ణనాతీతం. "నన్ను చూసుకునే వారు లేరు, ఈ బాధ భరించలేను"అన్న ఆవేదనతో అర్ధరాత్రి ఉరివేసుకుని తనువు చాలించారు. కొడుకు సంపాదనపైనే ఆధారపడి బతుకుతున్న వృద్ధ తల్లిదండ్రులు లిదళపతి రావు, సూర్య కుమారిలిలు నేడు పుత్రశోకంతో అనాథలుగా మిగిలారు. ఈ హృదయ విదారక ఘటన గురించి తెలిసిన వెంటనే బిజెపి పట్టణ అధ్యక్షుడు కే.జే.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి బాధితుల నివాసానికి చేరుకున్నారు. రాజు భౌతికకాయానికి నివాళులర్పించి, కన్నీరు మున్నీరవుతున్న ఆ వృద్ధ తల్లిదండ్రులను ఓదార్చారు. తక్షణ సాయంగా అంత్యక్రియల నిమిత్తం రూ. 10,000 నగదు అందజేశారు. "మీరు ఒంటరి వారు కాదు, మీ ఇంటి బిడ్డగా నేనున్నాననే ధైర్యం" వారికి కల్పించారు. ఏ కష్టం వచ్చినా నేరుగా తనకు ఫోన్ చేయాలని వారికి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "మద్యం మహమ్మారి ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోవడమే కాకుండా, కన్నవారిని అనాథలను చేసింది. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి. మీరు తీసుకునే తొందరపాటు నిర్ణయాలు మీ తల్లిదండ్రులను వీధిన పడేస్తాయని గుర్తించండి. ప్రాణం ఉన్నప్పుడే దాని విలువ తెలుసుకోండి" అని కళ్ళు తెరిపించేలా హితవు పలికారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం



**నంద్యాల, ఏప్రిల్ 30 (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల మండలములోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి,వ్యవసాయ విస్తరణ అధికారులకు 28మరియు 29 వ తేదీ లలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పై శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వివిధ పంటల సాగు విధానాలు, రసాయన ఎరువులు మరియు పురుగు మందులు వాడకం తగ్గించి నాటి ఆవు యొక్క మూత్రం, పేడ తో తయారు చేసిన జీవామృతం, ఘనజీవామృతం, ప్రకృతి లో లభించే సహజ పదార్థాలతో తయారు చేసిన వివిధ కాషాయలతో సాగు విధానాలు గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ పి.ఎం.డి.ఎస్ కిట్ల ఉపయోగాలను వివరించడం జరిగినది. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వివిధ రకాల పంటలకు సంబంధించిన అనగా 25 నుంచి 30 రకాల విత్తనాలను ఒక కిట్ లాగా తయారు చేసి రైతులకు అందించి, తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలాల్లో విత్తుకోవాలని రైతులకు సూచించాలని రైతు సేవా సిబ్బందికి చెప్పడం జరిగినది. ఈ విధంగా చేయుట వలన భూమి నిరంతరం పచ్చదనంతో కప్పబడి , తదుపరి వర్షాకాలంలో సాగు చేసే పంటలకు సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుందని, అలాగే భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందుతుందని, భూమి నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని అలాగే మొక్కలకు అవసరమైన అన్ని పోషకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ఖరీఫ్ కాలంలో రాబోవు ఎల్నినో ప్రభావాన్ని పంటలు తట్టుకోగలవని, కావున రైతులు తప్పనిసరిగా ఈ పద్ధతిని ఆచరించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. తర్వాత పాండురంగాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటలను వ్యవసాయ శాఖ సిబ్బంది సందర్శించారు .ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాష, ప్రభావతి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అనర్హులను తొలగించి అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి



**-మాల జన సమితి నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్**

**-భద్రాద్రి కొత్తగూడెం-అశ్వాపురం**

**అశ్వాపురం :** మండల కేంద్రంలో మాల జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పినపాక నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్ మాట్లాడుతూ అశ్వాపురం మండలం లో ఇందిరమ్మ ఇండ్లు రెండవ విడత లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించి నిరుపేదలను అర్హులను జాబితాలో చేర్చాలని గ్రామ సభ ద్వారా అర్హులను గుర్తించి విచారణ జరిపిన తర్వాతే తుది జాబితా ప్రకటించాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు... కానీ కొందరు వ్యక్తులు మా పేర్లు లిస్ట్‌లో వచ్చేసాయని లిస్టు ఫైనల్ అయిపోయింది అని ముందుగానే ప్రచారం చేస్తున్నారు.. కావున రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అనర్హుల పేర్లు ముందుగానే చేర్చారనే ఆరోపణలపై విచారణ జరపాలని అధికారులను కోరారు.. అనర్హుల పేర్లు జాబితాలో చేర్చడం వలన నిజమైన నిరుపేదలకు ఇండ్లు లేని అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని దీని ద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు... ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో అనర్హుల పేర్లు చేర్చి అవకతవకలు జరిగిన పక్షంలో జిల్లా హౌసింగ్ ఆఫీసర్-జిల్లాకలెక్టర్ గారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. .ఈ కార్యక్రమంలో మాలజనసమితి అశ్వాపురం మండల అధ్యక్షులు చెట్టి మనోజ్, జూపల్లి ధ్రువ కుమార్, బత్తుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పై అవగాహన కలిగి ఉండాలి





**-విద్యార్థులు చదవడం,ఆటల్లోనూ ఉండాలి**

**-అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-హాజరైన ఎస్పీ మహేష్ బి గీతే**

**ఇల్లంతకుంట, ఏప్రిల్ 30 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా సైబర్ క్రైమ్ పై ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో మహిళా,శిశు ,దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ,పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు,ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు,సేవలు అందించామని తెలిపారు. డ్రైవర్లకు వైద్య పరీక్షలు,కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930, బాలల హెల్ప్ లైన్ 1098,112, ఇతర సహాయం అందించే అన్ని హెల్ప్ లైన్ నంబర్లు ప్రతి ఒక్కరూ తమ ఫోన్ లో సేవ్ చేసుకోవాలని సూచించారు. బాలికలు,కిశోర బాలికలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే సంబంధిత హెల్ప్ లైన్ లో సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు ఆటలు ఆడాలని, కచ్చితంగా చదవాలని తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం చేయాలని, ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. డ్రాప్ ఔట్ కావద్దని స్పష్టం చేశారు. మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడిగుడ్లు, బాలామృతం,ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. చదివే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లలు తినడం, ఆడుకోవడం ఇతర అంశాల్లో రాణిస్తారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు కొలుస్తారని, దానికి సంబంధించిన కార్డులో నమోదు చేస్తారని, ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్యం, పోషకాహారం అందిస్తారని తెలిపారు. జిల్లాలో ఎవరైనా సైబర్ క్రైమ్ కు గురైతే వెంటనే 1930 లేదా సమీప పోలీసులను సంప్రదించాలని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. ఎలాంటి గుర్తింపు లేని వారు ఫోన్ చేసి ఓటీపీ,ఇతర వివరాలు చెప్పమంటే స్పందించవద్దని తెలిపారు. క్రెడిట్, డెబిట్ కార్డు యాక్టివేషన్, బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ నుంచి చేస్తున్నామని ఫోన్లో అడిగే వారికి స్పందించవద్దని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు డిజిటల్ అరెస్ట్ కాలేదని స్పష్టం చేశారు. అలాగే జనగణన కోసం ఇంటింటికి ప్రభుత్వ ఉద్యోగులు వస్తారని, వారి గుర్తింపు కార్డు, వివరాలు తెలుసుకున్న తరువాత అందరూ తమ వివరాలు వెల్లడించాలని తెలిపారు. మహిళలు, యువతల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ఫోటోలు షేర్ చేయవద్దని సూచించారు. కొందరు వ్యక్తులు మహిళలు, యువతుల ఫోటోలు మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సోషల్ మీడియా వాడే అప్పుడు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. సోషల్ మీడియా అకౌంట్ ప్రైవేట్ అని పెట్టాలని, పబ్లిక్ అని పెట్టవద్దని తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అరైవ్ అలైవ్ కింద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించామని తెలిపారు. ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వెళ్లడంతో నాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ లేకుండా వెళ్లడంతో మృతి చెందాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. గ్రామంలో ఏర్పాటు అయిన రోడ్ సేఫ్టీ కమిటీ బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని,వేసవి నేపథ్యంలో ఎండలో తిరగవద్దని సూచించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి,జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం,మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ,తహసీల్దార్ సురేష్,ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ గన్నారం వసంత తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లి SSC ఫలితాల్లో 100% ఉత్తీర్ణత



**బెల్లంపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి ప్రతిభ చాటుకుంది. ఈ ఏడాది 2026 ఎస్ఎస్సీ పరీక్షలకు హాజరైన మొత్తం 74 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ మాట్లాడుతూ, ఈ ఫలితాలు ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలకు ప్రతిబింబమని తెలిపారు. పాఠశాల టాపర్లలో జుమిడి అక్షయ్ కుమార్ 550 మార్కులతో మొదటి స్థానంలో నిలిచాడు. చుక్కకుంట్ల వివేక్ 545, కొప్పుల రిశ్వంత్ 535,గుమ్మడి చరణ్ 535, మరముల వర్షిత్ 531 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అదేవిధంగా 500 పైగా మార్కులు 21 మంది విద్యార్థులు సాధించడం విశేషంగా నిలిచింది. వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి విద్యార్థులను అభినందించగా, డిసిఓ రమా కళ్యాణి, జెఓ గిరిజలు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

## ఘనంగా భారతదేశ ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవి వర్మ జయంతి వేడుకలు



**భారత** దేశ ప్రఖ్యాత చిత్రకారుడు రాజారవివర్మ 178వ జయంతి వేడుకలను న్యూ నంద్యాల ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజా రవి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి వారు నివాళులర్పించారు. ఈ మధ్యకాలంలో రవివర్మ చిత్రించిన చిత్రానికి 167 కోట్ల రూపాయలకు విలువ చేసింది అని వారన్నారు. రాజా రవి వర్మ ఎంతో కృషి చేస్తే ఈ ఫలితం దక్కింది అని అన్నారు. రవి వర్మ తీసిన చిత్రాలకు పలు అవార్డులు వచ్చాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్, వాసు, రాజారాం నరసింహ, సుంకన్న, ఆనంద్ తరుణ్,రాజు,సీతారాం,బాచి,నరసింహులు,రాముతదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి యువకుడి మృతి



**వెలుగోడు, ఏప్రిల్ 30(జర్నలిస్ట్ ఫైల్):** వెలుగోడు మండలానికి చెందిన షేక్.నూరుల్లా కుమారుడు 17 ఏళ్ల షేక్ నౌమాన్ బుధవారం నాడు తన ఇంటి పక్కల వున్న కొంతమందితో కలిసి మోత్కూరులో వారు పని చేస్తున్న ఇంటి దగ్గరికి వెళ్ళాడు. అతను మధ్యాహ్నం సుమారు 12.30 గంటలకు టీ తాగిన తర్వాత గ్లాసును కింద పడేయడానికి ప్రయత్నించగా, ఆ సమయంలో అతనికి విద్యుత్ షాక్ తగిలి చనిపోయినాడని తండ్రి ఆరోపించారు. తండ్రి షేక్ నూరుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వెలుగోడు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## ఎండల వేళ అప్రమత్తం కావాలి పీహెచ్‌సీపై డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**నిర్మల్ జిల్లా, ఏప్రిల్ 30(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ప్రజా ఆరోగ్య సేవల పనితీరును పర్యవేక్షించే క్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని సేవలను సమగ్రంగా పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆశా కార్యకర్తల వద్ద ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన బాలికలకు హెచ్పీవీ టీకా ప్రాముఖ్యతపై అవగాహన పెంచి, వారు తప్పనిసరిగా టీకా పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి, అర్హులైన ప్రతి చిన్నారికి సకాలంలో టీకాలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవన్, ఉప జిల్లా విస్తరణ మరియు మాధ్యమ అధికారి బారె రవీందర్, వైద్యులు ప్రత్యూష, రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మైతాపూర్‌లో రక్తదాన మహాశిబిరం



**- 35 మంది యువత రక్తదానం**

**రాయికల్, ఏప్రిల్ 30(జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో బుధవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల శాఖ మరియు గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నీలారపు శ్రీనివాస్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలారపు శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం అనేది మనిషి చేయగలిగే అత్యంత గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఒక్క రక్తదానం ద్వారా ప్రమాదాల్లో గాయపడినవారు, శస్త్రచికిత్సలో ఉన్నవారు, ప్రసూతి స్త్రీలు, చిన్నపిల్లలు వంటి అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. గ్రామంలోని 35 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటారు. కార్యక్రమంలో జగిత్యాల జనరల్ హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్, గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, వార్డ్ సభ్యులు బత్తిని శ్రీనివాస్ పరమేష్, కొల్లవేణు నేమిళ్ల స్వామిరెడ్డి, బూస గంగ మల్లయ్య, అనుమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రక్తదాన శిబిర నిర్వాహకులు దొంగ జితేందర్, సద్ది మైపాల్, మోత్కూరి శ్రీనివాస్, రాజనాల మధు, అమరేందర్, శివనితి గంగారెడ్డి ఆధ్వర్యంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో మానవహక్కుల చైర్మన్ శ్రీరామ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని పెదరావూరు గ్రామంలో వేంచేసియున్న అభయ హస్త సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో గురువారం కేంద్ర మానవ హక్కుల చైర్మన్ శ్రీరామ సుబ్రహ్మణ్యం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ విద్యా గణపతి శ్రీ బాలాంబిక సమేత సర్వహితేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహా స్వామి ఆశీస్సులతో చింతపల్లి సుబ్రహ్మణ్య శర్మ సుబ్రహ్మణ్యన్ కు స్వాగతం పలికి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెనాలి న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని దంపతులు తెనాలి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర. కిక్కురి శ్రీనివాస్ రెడ్డి. వీఆర్వో శ్రవణ్ కుమార్. డిటి ప్రసాదరావు. పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు చింతపల్లి సుబ్రహ్మణ్య శర్మ. సహాయకులు పోలేపెద్ది రామకృష్ణ. ఆలయ అర్చకులు శుభం శర్మ ఉన్నారు.

## టెన్త్ ఫలితాల్లో ఎన్నారై ప్రభంజనం



- సిఇఒ సిహెచ్. ఉమామహేశ్వరావు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం విడుదల చేసిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో, ఎన్ఆర్ఐ, ఇండియన్ స్ప్రింగ్స్ విద్యార్థులు మెరిట్ మార్కులతో ప్రభంజనాన్ని సృష్టించారని ఎన్నారై విద్యాసంస్థల సీఈవో సిహెచ్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

స్థానిక రైల్వే స్టేషన్ రోడ్ లో గల ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, ఆ విద్యా సంస్థల సీఈవో సిహెచ్ ఉమామహేశ్వరరావు, మాట్లాడుతు ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. 99శాతం ఉత్తీర్ణత సాధించగా,. 594, 593,592,590 నలుగురు ఎన్నారై ప్రభంజనాన్ని చాటారని అన్నారు. అదేవిధంగా 7గురు 587మార్కులు, 11మంది 575 మార్కులు, 38మంది 550మార్కులు, 49మంది 525మార్కులు, 67మంది 500మార్కులు సాదించారని, విజేతలను అభినందించారు. పట్టణంలోని,రెండు బ్రాంచ్ ల,ద్వారా మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులను దృశ్యాలువులతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఐ స్కూల్స్ డీన్ వాసిరెడ్డి కిషోర్ బాబు, సీతారావమ్మ, సుహాసిని, జయంతి, విజయ కుమారి, ప్రసన్నలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివన్నారాయణ, కృష్ణారెడ్డి, ఏవో కిరణ్, శ్రీ లక్ష్మీ తదితర ఉపాధ్యాయులు విజేతలైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏటీసీ-16 శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్లు ఫైరింగ్ సాధన



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు 10 (ఏ) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీకి చెందిన మొత్తం 287 మంది కేడెట్లు నంబూరులోని వీవీవీఐటీయూ (వి వి ఐ టి యు)లో నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరం (ఏటీసి-16)లో ఫైరింగ్ సాధనలో విజయవంతంగా పాల్గొన్నారు. కేడెట్లలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు ఆయుధాల వినియోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ఫైరింగ్ సెషన్ నిర్వహించబడింది.

శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఎన్‌సీసీ అధికారుల పర్యవేక్షణలో కేడెట్లు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ ఆసక్తిని ప్రదర్శించారు. సర్వాంగీణ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరంలో డ్రిల్, శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలపై వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఫైరింగ్ సాధన శిబిరంలో ముఖ్య ఆకర్షణగా నిలిచి, కేడెట్లకు ప్రాయోగిక అనుభవాన్ని అందిస్తూ వారి ఉత్సాహాన్ని పెంచింది.

ఈ కార్యక్రమంలో కేడెట్లు చూపిన చురుకుదనం మరియు మెరుగైన ప్రదర్శనను అధికారులు అభినందించారు.

# మంచి చెబితే స్వీకరిస్తాం : ఎమ్మెల్యే నసీర్

- ప్రజలకు చెడు చేయాలంటే సహించం
- మోతీలాల్ నగర్ విషయంలో ఇకనైనా రాజకీయాలు ఆపండి
- గత పదేళ్లలో తూర్పులో అభివృద్ధి ఉందా ?
- వైసీపీని సూటిగా ప్రశ్నించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పేద ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి కార్యక్రమానికైనా తాము మద్దతుగా నిలుస్తామని, సైకో జగన్ ఆలోచనలకు అనుగుణంగా ఇక్కడ వ్యవహరిస్తే సహించేది లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ఆనంద్ పేట, ఐపీడీ కాలనీల్లో రూ. 1.50 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రోడ్ల మీదకు వచ్చి విమర్శలు చేస్తున్న నాయకులు గత పదేళ్లలో ఎక్కడ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆనందపేటలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్న నేపథ్యంలో స్థానికులతో మాట్లాడి పనులు చేపట్టామని తెలిపారు. ఖాళీ స్థలాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతిపక్షం కూడాలేని కొందరు సోషల్ మీడియా ఆర్టిస్టులుగా మారి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. మంచి విషయాలు చెబితే తాము స్వీకరిస్తామని, ప్రజలను హాని చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గత పదేళ్ల సుద్దపల్లి రోడ్డు, మాయాబజారు రోడ్డు, నందివెలుగు బ్రిడ్జి వంటి పనులు మూలనపడేస్తే.. తాము అధికారంలోకి వచ్చాక పూర్తి చేశామని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా రూ. 50 కోట్లతో పనులు పూర్తి చేశామని, మరిన్ని పనులు జరుగుతున్నాయని చెప్పారు. మోతీలాల్ నగర్ వాసుల విషయంలో ఎలాంటి రాజీ లేదని, వారికి పూర్తి మద్దతుగా నిలుస్తామని అన్నారు. ఈ విషయంలో వైసీపీ నాయకులు చేస్తోన్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు.

## చిన్నారుల్లో ధైర్యసాహసాలు పెంపొందాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- వెకేషన్ బైబిల్ స్కూల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నారుల్లో భక్తితో పాటు ధైర్యసాహసాలు పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే & తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం గుంటూరులోని సెయింట్ మాథ్యూస్ నార్త్ పారిస్ చర్చిలో నిర్వహించిన వెకేషన్ బైబిల్ స్కూల్ (VBS) కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే & తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి, చిన్నారులకు బహుమతులు అందజేశారు. తొలుత "సిగ్నెట్ రింగ్" థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పాటలు, బైబిల్ బోధనలు, వేదిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పారిష్ పాస్టర్ ఎస్. జోహన్ బాబు రావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జొన్నలగడ్డ ఉదయ భాను ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ వెకేషన్ బైబిల్ స్కూల్ వంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని, నేటి తరం పిల్లలు చదువుతో పాటు మంచి విలువలు, భక్తి, ధైర్యసాహసాలు కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. చిన్న వయసులోనే వేదికపైకి వచ్చి ధైర్యంగా మాట్లాడటం, తమ ప్రతిభను ప్రదర్శించడం ఎంతో గొప్ప విషయమని, ఇలాంటి ఎదీూ కార్యక్రమాలు పిల్లల్లో భయం తొలగించి సమాజంలో ధైర్యంగా ముందుకు వెళ్లే గుణాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అలాగే వేసవి సెలవులను సద్వినియోగం చేస్తూ పిల్లలకు బైబిల్ బోధనలు, నైతిక విలువలు, సహనం, ప్రేమ, పరస్పర గౌరవం వంటి మంచి విషయాలను నేర్పించడం అభినందనీయమని, నిర్వాహకులు, టీచర్లు చిన్నారుల్లో భక్తితో పాటు మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే బాధ్యతను ఎంతో సమర్థంగా నిర్వర్తిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.

ఈ కార్యక్రమాన్ని ఎన్నో సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్న పెద్దలను ఎమ్మెల్యే అభినందించారు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించి కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు కూడా ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## బ్రహ్మోత్సవాలకు కొండపాటూరు తలంబ్రాలు



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా కేంద్రం అయిన బాపట్ల లో వెంచేసియున్న బావునారాయణ స్వామి దేవస్థానంలో జరగనున్న 1433 బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వయం భూ కొండపాటూరు పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం నుండి మంగళసూత్రములు, తలంబ్రాలు మేళా తాళలతో సమర్పించిన్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ట్రస్ట్ బోర్డు సభ్యులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ) :** వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో పలు అభివృద్ధి పనులను గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిధి గా పాల్గొని ప్రారంభించారు.

గ్రామంలో రూ. 36 లక్షల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన 3 సీసీ రోడ్లను ఘనంగా ప్రారంభించిన సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ఒక రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు ఏళ్లలోనే వడ్డేం గుంటలో సుమారు 64 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్ఆర్ఈజీఎస్- పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 10 లక్షలతో 200 మీటర్ల రోడ్డు, మరో 10 లక్షలతో ఇంకొక రోడ్డు, 5 లక్షలతో ఒక సీసీ రోడ్డుతో పాటు, బీసీ వడ్డెర్ల కాలనీలో కాంపౌండ్ వాల్ కోసం 3 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. రైతులు కేవలం వరి వంటి సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, ఎకరానికి లక్షల్లో ఆదాయం ఇచ్చే పండ్ల తోటలు, కూరగాయల సాగు వంటి ఉద్యాన పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. బొల్లాపల్లి మండల రైతులు వాణిజ్య పంటలు, మిర్చి సాగులో జిల్లాలోనే నంబర్ వన్ తలసరి ఆదాయం సాధిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. అలాగే, గృహ వినియోగదారులకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం అందిస్తున్న సోలార్ విద్యుత్ పథకాలను ఉపయోగించుకుని అదనపు ఆదాయం పొందాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ, ప్రజలంతా ఐక్యంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

**తిరునాళ్ల వేడుకల్లో పాల్గొన్న జీవీ ఆంజనేయులు.....**

గ్రామ పర్యటన కు వెళ్లిన జీవీ ఆంజనేయులు గ్రామంలో పాతపాటేశ్వరమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల తిరునాళ్ల వేడుకల సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి, అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి విచేసిన ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆధ్యాత్మికతతో పాటు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షడ్ రుచుల సందర్శిని సత్యాస్ ప్రారంభం



- పాల్గొన్న డిఎస్పీ బి. జనార్ధనరావు, కమీషనర్ అప్పలనాయుడు, తహశీల్దార్ గోపాలకృష్ణ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** విభిన్న రంగాలకు నెలవై ఆంధ్రా ప్యారీస్ గా, వినుతి కెక్కిన తెనాలి లొ,షడ్ రుచుల భోజనం పసందుగా పంచేందుకు సత్యాస్ పేరిట సకుటుంబ సందర్శన రెస్టారెంట్ ఏర్పాటు కావడం, విభిన్న శాఖల ఉన్నతాదికారులు విశిష్ట అతిధులుగా పాల్గొని ప్రారంభించిన శుభసమయంలో, నవ్వుల పువ్వుల సందడి చోటుచేసుకుంది.

ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ సత్యా ఆధ్వర్యంలొ, స్థానిక కొత్తపేటలోని, ఓల్డ్ గవర్నమెంట్ హాస్పటల్ ప్రక్కన, సిటీయూనియన్ బ్యాంక్ మేడపైన, ఆధునికతకు అద్దం పడుతు, సంప్రదాయ, వెజ్, నాన్ వెజ్ వంటకాలను బోజన ప్రియులకు చేరువ చేసే సంకల్పంతొ, రూపుదిద్దుకున్న సత్యాస్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను, గురువారం డిఎస్పీ బి. జనార్ధనరావు, మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పల నాయుడు, మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ లు, విశిష్ట అతిధులుగా పాల్గొని ప్రారంభించారు. నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. నేటి తరం అభిరుచులు పంచె సత్యాస్ ప్రాంగణంలో అమర్చిన తైల వర్ణచిత్రాలు నాటి మన గ్రామీణ సంస్కృతిని చాటుతున్నాయి. విశాల మైన డైనింగ్ హాల్ తొ పాటుగా, మిని మీటింగ్ లు, ఫంక్షన్లకు,ప్రోజెక్టర్, స్క్రీన్ సౌకర్యం ప్రాధాన్యతను చాటుతున్నాయి. జ్యోతి ప్రజ్వలనతొ సత్యాస్ ను ప్రారంభించిన అధికారులు మాట్లాడుతు షడ్ రుచుల వంటకాలను సర్వ్ చేసే వేదిక, సకుటుంబ సదర్శినిగా తెనాలిలొ ఉన్నతిని చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా అతిధులను సంస్థ నిర్వాహకులు సత్య సముచిత రీతిన సత్కరించి తమ అభిమానం చాటుకున్నారు. ప్రారంభ కార్రక్రమంలొ, ఏపీయూడబ్ల్యూజే తెనాలి అధ్యక్షులు చందు సుబ్బారావు,శేషగిరి, పలువురు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## దొడ్డపనేని ఇందిర ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ షజీదా ఫస్ట్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పురపాలక సంఘ పరిదిలోని ఉన్నత పాఠశాలల్లో, పదవతరగతి ఫలితాల్లో దొడ్డపనేని ఇందిర బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభను చాటుకున్నారని, మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పరిదిలో మెరిట్ సాధించిన విద్యార్థినులను అభినందించారు.

గురువారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో దొడ్డపనేని ఇందిరా బాలికోన్నత పాఠశాల విద్యార్థునులు 79శాతం ఉత్తీర్ణత సాధించగా,షేక్ షజీదా590మార్కులతొ ప్రభుత్వ పాఠశాలలో, టౌన్ ఫస్ట్,సాధించగా,.

రావి సాంబయ్య మున్సిపల్ బలుర ఉన్నత పాఠశాల, 63శాతం ఉత్తీర్ణత,తొ, అభినవ్ 588మార్కులు స్కూల్ ఫస్ట్, మండలంలో సెకండ్ లొ, నిలిచాడు. మారీస్ పేటలోని నల్లమోతు చెంచురామానాయుడు ఉన్నతపాఠశాల, 60శాతం ఉత్తీర్ణతతొ, 568స్కూల్ ఫస్ట్ మార్కులు,ఐతానగర్ ఎన్ఎస్ఎస్-ఎమ్ స్కూల్ 77శాతం ఉత్తీర్ణతతొ, 578మార్కులు స్కూల్ ఫస్ట్ మార్కులు, గంగానమ్మ పేటలోని తోటకూర సుబ్బారావు మెమోరియల్ హైస్కూల్ 64శాతం ఉత్తీర్ణత, స్కూల్ ఫస్ట్ 564మార్కులు, చెంచుపేట కోగంటి శివ్వయ్య స్కూల్ 75శాతం ఉత్తీర్ణత, 550మార్కులు స్కూల్ ఫస్ట్ మార్కులు. మొత్తం ఆరు పురపాలక ఉన్నత పాఠశాలల్లో, కొత్తపేటలోని బాలికల పాఠశాల విద్యార్థిని టౌన్ ఫస్ట్ సాధించి, బాలికల సత్తా చాటుకున్నారు. టెన్త్ ఫలితాలపై మండల విద్యాశాఖ అధికారులు మేకల లక్ష్మీనారాయణ, జయంత్ బాబు లు తమ ఆనందాన్ని మీడియాతొ పంచుకున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# నేటి నుండి మే 30వ తేదీ వరకు ఇళ్ల గణన

- ప్రజల వ్యక్తిగత సమాచారం సురక్షితంగా ఉంటుంది
- అపోహలు అవసరం లేదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జనాభా గణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ పిలుపునిచ్చారు. మే 1వ తేదీ నుండి ప్రారంభం కానున్న జనాభా గణనపై అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 62,434 కుటుంబాలు స్వీయ గణనలో వివరాలు నమోదు చేసుకున్నాయని తెలిపారు.

జనాభా గణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతోందని చెప్పారు. జిల్లాలో 3,803 హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. 4,046 మంది ఎన్యుమరేటర్లను, 720 సూపర్వైజర్లను, 23 మంది ఛార్జ్ అధికారులను నియమించామన్నారు. ఇందులో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది 3213, జూనియర్ సహాయకులు 383 మంది, సీనియర్ సహాయకులు 220 మంది, ఇతరులు 950 మంది ఉన్నారని తెలిపారు. సిబ్బంది అందరికీ శిక్షణ నిర్వహించామని చెప్పారు. ఎన్యుమరేటర్లకు జనాభా గణనకు అవసరమయ్యే కిట్లు పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు అంకితభావంతో పనిచేసి సరయిన డేటా సేకరణ చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్యుమరేటర్లు మే 1వ తేదీన తమకు కేటాయించిన ఇళ్లను తమ ఎన్యూమరేషన్ కి సంబంధించి హద్దులు సరి చూసుకుని మే 30వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి, మ్యాప్ ఆధారంగా సరిహద్దులను గుర్తించి వారి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. జనాభా గణన ప్రారంభించే ముందు ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతం లే అవుట్‌ను సిద్ధం చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. స్వీయ గణన ఏప్రిల్ 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అవకాశం కల్పించగా, ఇళ్ల గణన మే 1వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ఎన్యుమరేటర్స్ కి, సూపర్వైజర్లకు ట్రైనింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎన్యుమరేటర్స్ జన గణనకి వచ్చినప్పుడు ఐడీ కార్డులను పరిశీలించి వివరాలు తెలియజేయాలని సూచించారు. ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షితంగా ఉంటుందన్నారు. సరైన సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితర ప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందన్నారు. జనాభా గణనలో వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు కోల్పోవడం జరగదని, ప్రజలందరూ ధైర్యంగా, ఖచ్చితమైన సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు అందించాలని కోరారు. ఖచ్చితమైన జనగణన వల్ల భవిష్యత్తులో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన వంటి ప్రభుత్వ ప్రణాళికలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

జన గణనకి వచ్చే సిబ్బందికి స్వీయ నమోదు చేసుకున్న వారు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడిని తెలపాలని సూచించారు. జనాభా గణనలో వచ్చే సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1855 కు కాల్ చేయవచ్చన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేష శ్రీ, మున్సిపల్ కమిషనర్ లు, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య జీవితాన్ని మలిచే మహాశక్తి: ఎంపీ సానా సతీష్ బాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు అభినందనలు తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో విద్యార్థులు కష్టపడి సాధించిన ఈ విజయమే వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.

విద్య అనేది జీవితాన్ని మలిచే మహాశక్తి అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని ఉన్నత లక్ష్యాల వైపు కృషి చేయాలని సూచించారు. పరీక్షల్లో విజయం ఒక ముఖ్యమైన మైలురాయి మాత్రమేనని, ఉన్నత విద్యలో మరింత పెద్ద విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

అలాగే ఆశించిన ఫలితాలు రాని విద్యార్థులు నిరుత్సాహానికి లోనవ్వకూడదని సూచించారు. ఇది కేవలం ఒక దశ మాత్రమేనని, మరింత పట్టుదలతో ప్రయత్నిస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు.

విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని కోరుతూ మరోసారి అభినందనలు తెలిపారు.

## స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులా లేక రోజుకూలీలా అన్న సందేహం కలిగే పరిస్థితి నెలకొన్నదని వారు వ్యాఖ్యానించారు. ఉద్యోగులకు తగిన పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రేషనలైజేషన్ పేరిట పనిభారం పెంచే విధానాన్ని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఒక పోస్టుకు నియమితుడైన ఉద్యోగికి మరో పోస్టుకు సంబంధించిన పనులు అప్పగించి ఒకే జీతంతో రెండు బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి అన్యాయమని పేర్కొన్నారు.

86పని ఒత్తిడి మరియు వివిధ సమస్యల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో కొనసాగుతున్న డెప్యుటేషన్లను తక్షణమే రద్దు చేసి, అర్హులైన ఉద్యోగులను ఆయా శాఖల్లో విలీనం చేయాలని స్పష్టం చేశారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు స్పష్టమైన ప్రమోషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఛానల్ త్వరగా అమలు చేయాలని కోరారు. మహిళా పోలీసుల సేవా నిబంధనలపై కూడా పూర్తి స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని ఆరు విభాగాల్లో పనిచేస్తున్న స్వర్ణ వార్డు ఉద్యోగులకు ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా పదోన్నతులు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రేషనలైజేషన్ కారణంగా ఉద్యోగులపై అధిక పనిభారం మోపడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు న్యాయంగా దక్కాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లను వెంటనే మంజూరు చేయాలని, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం కింద ఆరు సంవత్సరాలు ఒకే క్యాడర్లో పనిచేసిన వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# మురుగు కాలువల్లో తాగునీటి పైపు లైన్లు ఉండరాదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో మురుగు కాలువల్లో తాగునీటి పైపు లైన్లు ఉండరాదని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. జిల్లా తాగునీరు, పారిశుధ్య కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మురుగు కాలువల నుండి తాగునీటి పైపు లైన్లు వెంటనే తొలగించాలని, ఆ మేరకు ధ్రువీకరణ చేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో తాగునీటి పైపు లైన్లు లీకేజీ లకు గురై అతిసార వంటి వ్యాధులకు గురైతే క్షేత్ర స్థాయి సిబ్బంది నుండి పర్యవేక్షక ఇంజనీర్ వరకు బాధ్యత వహిస్తారని హెచ్చరించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా ప్రతి క్షణం పర్యవేక్షణ జరగాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం సూచనలు మేరకు ఫీకల్ స్లడ్జి ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశం ఉన్న గ్రామాల జాబితాను నిబంధనలకు అనుగుణంగా సమర్పించాలని ఆదేశించారు.

**కనీసం రెండు ఆదర్శ గ్రామాలను రూపొందించాలి**

జిల్లాలో కనీసం రెండు ఆదర్శ గ్రామాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా గ్రామాల్లో అన్ని సౌకర్యాలు సంపూర్ణంగా ఉండాలని, తద్వారా ఇతర గ్రామాల్లో మార్పు వస్తుందని చెప్పారు. ఆదర్శ గ్రామాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, కాలువలు, రహదారులు, పారిశుధ్యం, చెత్త సేకరణ కార్యక్రమం, వీధి దీపాలు, మంచి వైద్య సేవలు, విద్యా సంస్థ తదితర సౌకర్యాలు ఉండాలని సూచించారు.

జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలో జల జీవన్ మిషన్ కింద 131 పనులను రూ.95 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు.

ప్రత్యేక అభివృద్ధి పథకం కింద 80 పనులను రూ.138 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేసి సిద్ధంగా ఉంచమని తెలిపారు. హర్ గర్ జల్ కార్యక్రమం క్రింద 111 పనులకు రూ.96 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో 2,368 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయగా 2248 పూర్తి చేయడం జరిగిందని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- శుక్రవారం పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
- 'మేడే' సందర్భంగా కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి
- గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలకు వెళ్లనున్నారు. ఎన్టీఆర్ భరోసా లబ్దిదారులతో మాట్లాడనున్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.63,158 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో పేదలకు అందించింది. ప్రతీ నెల కృష్ణాజిల్లాలో 2.34 లక్షల మందికి రూ.102 కోట్లను ప్రభుత్వం పింఛను రూపంలో ఇస్తోంది. పింఛన్ల పంపిణీ అనంతరం 'మేడే'ను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు భవన నిర్మాణ కార్మికులతో సమావేశం అవుతారు. గుడ్లవల్లేరులో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు** : కృష్ణా జిల్లాలో పేదల సేవలో, మేడే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం నుంచి బయలుదేరి పమిడిముక్కల మండలం, వీరంకిలాకు గ్రామానికి ఉదయం 10.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి పమిడిముక్కలకు 10.25 గంటలకు చేరుకుని ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలోని ఎన్టీఆర్ భరోసా లబ్దిదారుల ఇళ్లకు వెళ్తారు. వారికి పింఛను అందించి వారితో కాసేపు మాట్లాడతారు. ఎన్టీఆర్ కాలనీ నుంచి వీరంకిలాకు గ్రామానికి చేరుకుంటారు. మేడే సందర్భంగా మధ్యాహ్నం 12.45 గంటలకు భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 01.55 పామర్రు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ముగించుకుని 03.40 గంటలకు గుడ్లవల్లేరు చేరుకుంటారు. 03.50 గంటలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

## చీఫ్ కమిషనర్‌గా అహ్మద్ బాబు కొనసాగాలి: జీఎస్టీ అసోసియేషన్ డిమాండ్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : వాణిజ్య పన్నుల శాఖలో ఇటీవల నెలకొన్న పరిణామాల నేపథ్యంలో చీఫ్ కమిషనర్‌గా అహ్మద్ బాబును కొనసాగించాలంటూ ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు వన్, టూ డివిజన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరులోని సిటీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో వారు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

గత రెండు రోజులుగా శాఖలో నెలకొన్న గందరగోళ పరిస్థితులపై అసోసియేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి తన ప్రమోషన్ కోసం కోర్టును ఆశ్రయించగా, హైకోర్టు చీఫ్ జస్టిస్ శాఖకు సమస్య పరిష్కారం కోసం గడువు ఇచ్చినప్పటికీ, ఆ గడువు పూర్తికాకముందే చీఫ్ కమిషనర్‌ను తొలగించాలనే డిమాండ్లు రావడం సరైంది కాదని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో జరిగిన రీడిప్లాయిమెంట్ సమయంలో జోన్-3లో అనేక పోస్టులు రద్దు కావడంతో దిగువ స్థాయి ఉద్యోగులు ఇతర జోన్లకు బదిలీ కావాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు, అప్పటి సంఘ నాయకత్వం స్పందించలేదని విమర్శించారు. ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ముందుకు రాని నాయకులు, ఇప్పుడు స్వార్థ ప్రయోజనాల కోసం సమస్యలను రేకెత్తించడం తగదన్నారు.

అహ్మద్ బాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత శాఖలో పలు సంస్కరణలు అమలు చేసి, సాంకేతికత వినియోగాన్ని పెంచి పన్ను వసూళ్లను గణనీయంగా పెంచినట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలిటిక్స్ సెంటర్ ద్వారా పని భారాన్ని తగ్గించి, వసూళ్ల ప్రక్రియను సులభతరం చేసినట్లు పేర్కొన్నారు. పన్ను ఎగవేతలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, వందలాది ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించడంలో కూడా కృషి చేసినట్లు చెప్పారు.

ఈ సందర్భంగా గుంటూరు వన్ డివిజన్ అధ్యక్షుడు పవన్ కుమార్, కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ శాఖ అభివృద్ధి కొనసాగాలంటే అహ్మద్ బాబు చీఫ్ కమిషనర్‌గా కొనసాగాలని స్పష్టం చేశారు.

అలాగే టూ డివిజన్ అధ్యక్షుడు శ్రీను బాబు, కార్యదర్శి సుధారాణి మరియు వారి కార్యవర్గ సభ్యులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

శాఖ ప్రతిష్టను కాపాడుతూ, పన్ను వసూళ్లను మరింత పెంచేందుకు అహ్మద్ బాబును కొనసాగించాలని ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని అసోసియేషన్ కోరింది.

# మంగళగిరి వాలీబాల్ లీగ్-4 మూడవ రౌండ్ డ్రా



- 16 జట్ల మధ్య 8 మ్యాచ్‌లకు జట్ల జోడీలు ఖరారు

**తాడేపల్లి,(జర్నలిస్ట్ ఫైల్)**: మంగళగిరి వాలీబాల్ లీగ్-4 (MVL-4) టోర్నమెంట్ మూడవ రౌండ్‌లో జరగనున్న మ్యాచ్‌లకు సంబంధించిన డ్రా కార్యక్రమం గురువారం సాయంత్రం తాడేపల్లి నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జట్టు సభ్యులు, క్రీడాకారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. మూడవ రౌండ్‌లో మొత్తం 16 జట్లు పోటీలో నిలవగా, వాటి మధ్య 8 ఉత్కంఠభరిత మ్యాచ్‌లు జరగనున్నాయి. డ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, జట్లకు మ్యాచ్‌ల క్రమాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ, మంగళగిరి వాలీబాల్ లీగ్-4 టోర్నమెంట్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ప్రతి రౌండ్‌లోనూ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయని తెలిపారు, మంత్రి నారా లోకేష్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందుతోందని క్రీడాకారులకు ప్రతిభ చాటుకునే మంచి వేదికగా ఎంవీఎల్ -4 నిలుస్తోందని పేర్కొన్నారు. టోర్నమెంట్ విజేతలకు నారా లోకేష్ స్ఫూర్తితో భారీ నగదు బహుమతులు ప్రకటించారు. ప్రథమ బహుమతిగా రూ.1.50 లక్షలను అరవపల్లి శ్రీనివాసరావు, ద్వితీయ బహుమతిగా రూ.1 లక్షను కోగంటి ప్రసాద్, తృతీయ బహుమతిగా రూ.50 వేలను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు సహకారంతో అందించనున్నారు. ఈవెంట్ స్పాన్సర్లుగా శ్రీ శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్, సిగ్నేచర్ డైన్, మంగళాద్రి డెవలపర్స్, సెలారా ఫైన్ జ్యూవెలరీ, మాన్విక్ హ్యాండీక్రాఫ్ట్స్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపీ టీవీ యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. టోర్నమెంట్‌కు వాటర్ బాటిల్స్ స్పాన్సర్‌గా జీ సత్యన్నారాయణ, ఫుడ్ స్పాన్సర్‌గా గుత్త కిషోర్, స్నాక్స్ స్పాన్సర్‌గా షేక్ రియాజ్ సేవలందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# హజ్ యాత్రికుల భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యత



- హజ్ యాత్ర ఏర్పాట్లపై పెమ్మసాని

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : విజయవాడ విమానాశ్రయంలో హజ్ కు వెళ్లే ప్రయాణికుల ఏర్పాట్లపై కేంద్ర గ్రామీణాభివృద్ధి ఉ కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వివరాలు వెల్లడించారు. గుంటూరు – పొన్నూరు రోడ్డులో ఉన్న M Conventionలో జరిగిన ఈ సమావేశంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తో కలిసి పెమ్మసాని గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్ర ప్రతి ముస్లిం భక్తుడి జీవితంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్ర అన్నారు. హజ్ యాత్రికుల భద్రత, సౌకర్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. హజ్ – 2026 కోసం విజయవాడను ఎంబార్కేషన్ పాయింట్‌గా ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్ళే యాత్రికులకు పెద్ద ఎత్తున ప్రయాణ సౌలభ్యం కల్పించామని తెలిపారు.

విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించే ప్రతి యాత్రికుడికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వం కట్టుబాటును ప్రతిబింబిస్తుందని చెప్పారు. విజయవాడ నుంచి మదీనాకు నేరుగా చార్టర్ విమాన సర్వీసులు విజయవంతంగా నిర్వహించబడుతూనట్లు తెలిపారు. గన్నవరం హజ్ శిబిరంలో రిజిస్ట్రేషన్, వసతి, భోజనం, త్రాగునీరు, ప్రార్థన స్థలాలు, పారిశుధ్య సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. యాత్రికుల రవాణా కోసం ప్రత్యేక బస్సుల సదుపాయాలు కల్పించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి ఇతర ఎంబార్కేషన్ కేంద్రాలతో కూడా సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రాల మధ్య సమన్వయంతో యాత్రికులకు పూర్తి సహకారం అందిస్తున్నామని వెల్లడించారు. మైనారిటీ సంక్షేమం కోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయని, అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు కమ్యూనిటీ సదుపాయాలను విస్తరించే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. సమాజంలో ఐక్యత, శాంతి అత్యంత ముఖ్యమని, అపోహలు, దుష్ప్రచారాలకు లోనుకాకుండా ప్రజలు కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "యాత్రికుల విశ్వాసాన్ని కాపాడుతూ, భద్రతతో కూడిన సౌకర్యవంతమైన హజ్ యాత్రను అందించడం మా బాధ్యత" అని డా. పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం ఏర్పాటు చేయాలి

- ఏపీజేఏసి అమరావతి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి తక్షణమే మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఏపీజేఏసి అమరావతి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏపీజేఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈ సందర్భంగా పలు కీలక డిమాండ్లను వారు ముందుంచారు. 2004కు ముందు నోటిఫికేషన్ ఇచ్చి ఎంపికైన ఉద్యోగులందరికీ యాక్టు 57 ద్వారా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు వర్తింపజేసిన విధానాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని సూచించారు. పబ్లిక్ సెక్టర్, గురుకులాలు, సొసైటీ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గతంలో మంత్రివర్గ ఉపసంఘం చర్చించి కొన్ని అంశాలపై నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, ముఖ్యమైన ఆర్థికేతర సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం ఆలస్యం కావడంతో ఉద్యోగులు, పెన్షనర్లలో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఏపీ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, క్లాస్-4 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఏపీపీఎటిడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం స్వర్ణలత

- కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నిర్వర్తించే తత్వం
- అదనపు సంచాలకులు స్వర్ణలత కు ఆత్మీయ వీడ్కోలు
- సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్
- వృత్తి పట్ల నిబద్ధత, సేవా దృక్పథం... అదే ఆమె ఆయుధం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : బాధ్యతల నిర్వహణలో మాత్రమే కాకుండా, అచంచల నిబద్ధతకు, ఉన్నతమైన వృత్తి నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తూ, శాఖ ప్రతిష్టను మరింతగా పెంపొందించడంలో పదవీ విరమణ పొందుతున్న అధికారులు కీలక పాత్ర పోషించారని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ తెలిపారు.

స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనం రెండవ అంతస్థులోని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు ఎల్. స్వర్ణలత, ఉపసంచాలకులు బి. పూర్ణచంద్రరావు, జూనియర్ అసిస్టెంట్ వి. హరిబాబు ల ఆత్మీయ పదవీ విరమణ వీడ్కోలు సమావేశానికి సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంచాలకులు కే. విశ్వనాథన్ మాట్లాడుతూ... సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారన్నారు. తమ సుదీర్ఘ సేవాకాలంలో ప్రతి దశలో వారు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరవేయడంలో వారు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, ఓర్పు ప్రశంసనీయం అన్నారు. తోటి ఉద్యోగులు, జూనియర్ అధికారులకు మార్గనిర్దేశం చేస్తూ, ఆదర్శకులుగా నిలిచారన్నారు. శాఖ కార్యక్రమాల విజయవంతానికి రాత్రింబవళ్లు కృషి చేస్తూ వారు చూపిన అంకితభావం మరువలేనిదన్నారు. పదవీ విరమణ అనేది బాధ్యతల ముగింపు మాత్రమే కాదని వ్యక్తిగత అభిరుచులకు, విశ్రాంతికి దొరికే కొత్త ఆరంభం అని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. వారి అనుభవం, వారు నెలకొల్పిన విలువలు శాఖలో ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయని తెలిపారు.. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సంచాలకులు ఆకాంక్షించారు. సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘకాలంపాటు సేవలు అందించిన అదనపు సంచాలకులు తమ పదవీ విరమణ సంతోషం, సుఖశాంతులతో ఉండాలని కే. విశ్వనాథన్ కోరుకుంటున్నట్లు తెలిపారు.

సమాచార పౌర సంబంధాల శాఖలో అదనపు సంచాలకులుగా పదవీ విరమణ చేస్తున్న ఎల్ స్వర్ణలత మాట్లాడుతూ.... 1992 నుండి ఇప్పటి వరకు సుదీర్ఘ కాలం సమాచార శాఖలో సేవలందించారని పేర్కొన్నారు. తనకు కుటుంబం తర్వాత సమాచార శాఖే అంతటి ప్రాముఖ్యమని, ఈ శాఖలోని వారందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేశారని ఆమె భావోద్వేగంతో తెలిపారు. వృత్తిలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పనిని ఇష్టపడి ఆస్వాదిస్తూ (జుఅయిశీఎవత్ అఱ్‌ఫ్రవ షశీతీ‌ని) చేశానని చెప్పారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (=వస్త్రఱశీఖశ్రీ జీశీఱ‌త్ ఱఱతీవషశీతీ) కార్యాలయంలో పనిచేస్తూ జోన్ 1, 2 మరియు 3 పరిధిలోని అన్ని జిల్లాల వారితో సాన్నిహిత్యం కలిగి ఉన్నానని, జోన్ 4 లో విద్యాభ్యాసం జరిగిందని గుర్తుచేసుకున్నారు. తనకు సహకరించిన ఉన్నతాధికారులు, ఇతర మిత్రులు, సహోద్యోగులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి ఓఎస్డీ డాక్టర్. ఎన్. ప్రకాశరావు, మాట్లాడుతూ.. ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో వారు ప్రదర్శించిన ఓర్పు, సమయస్ఫూర్తి అభినందనీయమన్నారు.

పదవీ విరమణ సందర్భంగా ఎల్. స్వర్ణలత, బి. పూర్ణచంద్రరావు, వి. హరిబాబు లు చేసిన సేవలను కొనియాడుతూ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. వీడ్కోలు కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు పి. కిరణ్ కుమార్, కస్తూరి బాయి తేళ్ల, ఐ. సూర్యచంద్రరావు, ఛీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూధన్, ఆర్ఐఈ లు కృష్ణా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, డాక్టర్. టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు పి. తిమ్మప్ప, పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, కే. నారాయణ రెడ్డి, పి. రాజశేఖర్, తిరుపాలయ్య, ఎస్వీ మోహన్ రావు, ఏవో పి. సుదర్శనరావు, జేఈవో నాగరాజు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467